https://teluguislam.net

# ఇస్లాం శుభోదయ సమయాన అరేబియా పరిస్థితి

https://teluguislam.net

https://teluguislam.net



# ఇస్లాం శుభోదయ సమయాన అరేబియా పరిస్థితి

## అరేబియా నైసర్గిక స్వరూపం - జాతులు

దైవ సందేశానికి అనుగుణంగా, దైవప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వ సల్లం గారి జీవితం కొనసాగిన వైనాన్నే మనం 'మహాప్రవక్త (స) జీవిత చరిత్ర'గా, 'సీరతున్నబీ'గా లేదా 'దివ్యచరితం'గా చెప్పుకోవడం జరుగుతోంది. అజ్ఞానపు చీకట్లల్లో కొట్టుమిట్టాడుతున్న మానవాళిని తన దివ్యచరితం ద్వారా విజ్ఞాన కాంతి వైపునకు నడిపించారాయన. అదే కాకుండా ఆయన దాసుల దాస్యం నుండి మానవాళిని బయటకు లాగి దైవదాస్యం వైపునకు పురోగ మింపజేసిన మహామనీషి. దైవసందేశావతరణకు పూర్వం, ఆ తరువాత సంభ వించిన సంఘటనలను, నెలకొన్న పరిస్థితులను పోల్చి చూస్తే తప్ప, మహాప్రవక్త (స) గారి దివ్యచరిత్రను మలచడం సాధ్యం అయ్యే పని కాదు. అందుకని, అసలు చర్చకు వచ్చే ముందు ఈ అధ్యాయంలో ఇస్లాం ఆవిర్భావానికి పూర్వం దైవసందేశహరులైన ముహమ్మద్ (స) ప్రభవించిన ఆ అరబ్బు జాతులు, వాటి వృద్ధివికాసాల తీరుతెన్నులు ఎలాంటివో తప్పకుండా అధ్యయనం చేయవలసి ఉంది.

## అరేబియా నైసర్గిక స్వరూపం

'అరబ్బు' అనే పదానికి నిఘంటువుల్లో 'ఎడారి', 'నిర్జల ఊసర క్షేత్రం' అని అర్థాలున్నాయి. అనాదిగా అరేబియా ద్వీపకల్పం, ఆ ద్వీపకల్పంలో నివసించే జాతుల కోసం వాడబడిన పదమిది. అరేబియాకు పశ్చిమాన ఎర్ర సముద్రం మరియు సినాయి ద్వీపకల్పం ఉన్నాయి. తూర్పున అరేబియా అఖాతమే కాకుండా దక్షిణ ఇరాఖ్‌కు చెందిన ఓ పెద్ద భూభాగం; దక్షిణాన అరేబియా సముద్రం ఉంది. నిజానికి ఇది విస్తరించిన హిందూ మహాసముద్ర

https://teluguislam.net



మనే అనాలి. ఉత్తర దిక్కున సిరియా దేశం, ఉత్తర ఇరాఖ్‌కు చెందిన కొంత భూభాగం కలసి ఉన్నాయి. వీటిలో కొన్ని సరిహద్దుల విషయమై భేదాభిప్రాయం ఉంది. మొత్తం భూభాగం వైశాల్యం పది నుండి పదమూడు లక్షల చదరపు మైళ్ళు ఉంటుందని అంచనా వేయడం జరిగింది.

అరేబియా ద్వీపకల్పం భౌతికంగానూ, భౌగోళికంగానూ గొప్ప ప్రాముఖ్యతను సంతరించుకున్న భూభాగం. అంతర్గతంగా ఇది నలు వైపుల నుండి ఎడారి, కొండలు, గుట్టలతో పరివేష్ఠింపబడి ఉన్న కారణంగా, విదేశీ జాతులు దీన్ని ఏ మాత్రం జయించడానికిగానీ, తమ ప్రభావాన్ని విస్తరింప జేయడానికిగానీ వీలులేని ఒక సురక్షిత దుర్గంగా రూపొందింది. ఈ కారణంగానే అరేబియా ద్వీపానికి చెందిన ప్రజలు అనాదిగా తమ సమస్త వ్యవహారాల్లో పూర్తిగా స్వతంత్రులుగా ఉంటూ వచ్చారు. పెట్టని కోటల్లా ఉన్న ప్రకృతి సిద్ధమైన ఈ గట్టి అడ్డంకులే లేకపోతే, అరేబియా ప్రజలకు పొరుగునే ఉన్న రెండు గొప్ప శక్తిమంతమైన సామ్రాజ్యాల దండయాత్రలను అడ్డుకునే శక్తి ఏ మాత్రం లేకపోయేది.

ఇక బాహ్యాపరంగా చూస్తే, పురాతన కాలానికి చెందిన భూఖండాలన్నింటికి నట్టనడుమన అరేబియా ద్వీపకల్పం ఉంది. భూమార్గాన్నే కాకుండా సముద్ర మార్గాన కూడా ఆ ఖండాలతో సంబంధం కలిగి ఉన్న దేశమిది. అరేబియా వాయవ్య దిశ ఆఫ్రికా ఖండపు ప్రవేశ ద్వారంగాను, ఈశాన్య దిశ ఐరోపా ఖండంలో ప్రవేశించే మార్గంగాను, తూర్పు దిశ ఇరాన్, మధ్యాసియా మరియు దూర ప్రాచ్య ద్వారాలను తెరుస్తోంది. ఈ మార్గం గుండానే భారత దేశం, చైనా వరకు రాకపోకలు సాగగలవు. ఇలాగే ప్రతి ఖండం సముద్ర మార్గాన కూడా అరేబియా ద్వీపకల్పంతో సంబంధం కలిగి ఉంది. ఆ ఖండాల నుండి ఓడలు నేరుగా అరేబియా ఓడరేవుల్లోనికి వచ్చి నిలుస్తాయి.

ఈ భౌగోళిక స్వరూపం కారణంగా, అరేబియా ద్వీపకల్పం యొక్క ఉత్తర దక్షిణ భూభాగాలు వివిధ జాతులకు రక్షణ స్థావరాలుగాను, వ్యాపార వాణిజ్యాలకు, సాంస్కృతిక ధార్మిక భావాలకు మార్పిడి కేంద్రాలుగానూ విలసిల్లాయి.

## అరబ్బు జాతులు

చరిత్రకారులు వంశాలు, సంతతిపరంగా అరబ్బు జాతుల్ని మూడు రకాలుగా విభజిస్తారు.

https://teluguislam.net



1. **బాయిదా అరబ్బులు :** అంటే పూర్తిగా మరుగున పడిపోయిన అరబ్బు తెగలు, జాతులు అన్నమాట. ఇవి ఆద్, సమూద్, తస్మ్, జదీస్, అమాలికా వగైరాలు. వీటికి సంబంధించిన వివరాలు మరుగైపోయి నందున లభ్యం కాలేదు.

2. **ఆరిబా అరబ్బులు :** అంటే యారూబ్ బిన్ యష్‌జబ్ బిన్ ఖహ్‌తాన్ సంతతికి చెందిన అరబ్బులు అని అర్థం. వీరిని ఖహ్‌తానీ అరబ్బులని కూడా పిలుస్తారు.

3. **ముస్తారిబా అరబ్బులు :** వీరు ప్రవక్త హజ్రత్ ఇస్మాయీల్ (అ.స.) సంతతికి చెందిన అరబ్బులు. వీరిని అద్‌నానీ అరబ్బులుగా వ్యవహ రిస్తారు. ఆరిబా అరబ్బులు లేక ఖహ్‌తానీ అరబ్బుల అసలు నివాసం 'యమన్' దేశం. ఇచ్చటి నుండే వారి కుటుంబాలు, తెగలు వివిధ శాఖల్లో వెలిసి విస్తరించాయి. వీరిలో రెండు మాత్రం మంచి పేరు ప్రఖ్యాతులు గడించుకున్న తెగలు. అవి: 1. హమీర్, 2. కహ్‌లాన్.

హమీర్‌కు చెందిన ప్రముఖ శాఖలు 'జైదుల్ జమ్‌హూర్', 'ఖుజాఅ' మరియు 'మకాసిక్'లు.

కహ్‌లాన్‌కు చెందిన ప్రఖ్యాత శాఖలు హమ్దాన్, అన్మార్, తై, మజ్‌హిజ్, కిందా, లఖ్మ్, జుజామ్, అజ్ద్, అవస్, ఖజ్రజ్ మరియు జుఫ్నాలు. జుఫ్నా సంతతివారు సిరియా చుట్టుపట్ల రాజ్యాలను స్థాపించి 'ఆలె గస్సాన్'గా పేరుగాంచారు.

సాధారణ కహ్‌లానీ తెగలు ఆ తరువాత యమన్‌ను వదిలి అరేబియా ద్వీపంలోని వివిధ ప్రదేశాల్లోనికి వ్యాపించాయి. 'సీలె అరిమ్' సంఘటనకు పూర్వం, రోమనులు, ఈజిప్ట్, సిరియాలను హస్తగతం చేసుకొని యమన్‌పై దండెత్తడం జరిగింది. యమన్‌కు సంబంధించిన వ్యాపార మార్గాలను, సముద్ర మార్గాన్ని వశపర్చుకున్నారు. భూమార్గ వసతులన్నిటిని తుదముట్టించి కహ్‌లానీల వ్యాపారంపై వ్రేటువేసినందున కహ్‌లానీలు మూకుమ్మడిగా దేశాన్ని వదిలేసి వలసపోవలసివచ్చింది.

కహ్‌లానీ మరియు హమీరీ కుటుంబాల నడుమ మనస్పర్థలు కూడా కహ్‌లానీల వలసకు కారణం కావచ్చు. హమీరీలు మాత్రం వలస పోకుండా

https://teluguislam.net



ఉండడం, కహ్లానీలు మాత్రమే వలసపోవడం అనే విషయం దీన్ని ధృవీకరిస్తోంది.

## వలస వెళ్ళిన కహ్లానీ తెగల్ని నాలుగు రకాలుగా విభజించవచ్చు

**1. అజ్ద్ :** వీరు తమ నాయకుడు ఇమ్రాన్ బిన్ అమ్రూ మజీఖియా సలహాపై దేశాన్ని వీడినవారు. మొదట యమన్‌లోనే ఓ చోటి నుండి మరో చోటికి మారుతూవచ్చినవారు వీరు. దీని కోసం ముందే వారు ఓ గూఢాచార బృందాన్ని ఏర్పర్చుకొని, పరిస్థితులను ఆకళింపు చేసుకొని మరీ కదిలేవారు. చివరికి వీరు ఉత్తర దిశ వైపునకు వెళ్ళి వేర్వేరు ప్రదేశాల్లో శాశ్వతంగా స్థిరపడిపోయారు. ఆ శాఖల వివరాలు ఇలా ఉన్నాయి.

**సాలిబా బిన్ అమ్రూ:** ఈ శాఖ మొదట హిజాజ్ వైపునకు బయలుదేరి సఅల్బియా, జీకార్ల నడుమ నివాసం ఏర్పర్చుకుంది. సంతానం పెరిగి పెద్దదై శక్తి పుంజుకున్న తరువాత మదీనాకు వెళ్ళి అక్కడనే స్థిరమైపోయింది. ఈ సాలిబా సంతతి నుండే అవస్, ఖజ్రజ్ తెగలు ఉద్భవించాయి. అవస్, ఖజ్రజ్ అనేవారు సాలిబా కుమారుడైన హారిసా కొడుకులు.

**హారిసా బిన్ అమ్రూ:** అంటే 'ఖుజాఅ' మరియు దాని సంతతి అన్నమాట. మొదట వీరు 'హిజాజ్'లో దేశదిమ్మరులుగా తిరుగుతూ మర్రజ్‌జహ్రాన్‌లో మజిలీ చేశారు. ఆ తరువాత మక్కాపై దండెత్తి బనూ జుర్హుంను అచ్చటి నుండి పారద్రోలి మక్కాలోనే స్థిరనివాసం ఏర్పర్చుకున్నారు.

**ఇమ్రాన్ బిన్ అమ్రూ:** అతనూ, అతని సంతానం అమ్మాన్‌లో స్థిరపడిపోయారు. అందుకే వీరు' అజ్దె అమ్మాన్'గా పిలువబడతారు.

**నస్ర్ బిన్ అజ్ద్ :** ఈ శాఖకు సంబంధించిన తెగలు తహామాలో స్థిరపడ్డారు. వీరు 'అజ్దె షనూవా'గా పేరుపొందారు.

**జుఫ్నా బిన్ అమ్రూ :** ఇతను సిరియా దేశానికి వెళ్ళి తన సంతానంతో అక్కడనే స్థిరపడిపోయాడు. ఇతనే గస్సానీ పాలకులకు మూలపురుషుడు కూడాను. వారు సిరియాకు వెళ్ళడానికి పూర్వం హిజాజ్‌లో గస్సాన్ అనే ఒయాసిస్సు వద్ద కొంతకాలం నివాసం ఉండటం వలన వారిని అలె గస్సాన్‌గా పిలుస్తారు.

**2. లఖ్మా వజ్‌జామ్‌లు :** హీరాకు చెందిన ఆలె మున్జిర్ రాజుల మూలపురుషుడు నస్ర్ బిన్ రబీ ఈ లక్మీల్లోని వాడే.

https://teluguislam.net



**3. బనూ తై:** ఈ తెగ, బనూ అజ్ద్ వలస వెళ్ళిన తరువాత ఉత్తరం వైపునకు పయనించి 'అజా', 'సల్మా' పేర్లుగల రెండు కొండల దరిదాపుల్లో శాశ్వతంగా స్థిరపడిపోయింది. చివరికి ఈ రెండు కొండలు 'తై' తెగ కారణంగా ఖ్యాతిని పొందాయి.

**4. కిందా:** వీరు మొదటగా బహ్రైన్ - ప్రస్తుత అల్ అహ్సార్ - లో విడిది చేశారు. అయితే కొన్ని అనివార్య కారణాల వల్ల దాన్ని వదిలి హజర్‌మౌత్‌కు వెళ్ళిపోయారు. అక్కడ కూడా వారికి సంరక్షణ లభించక చివరికి 'నజద్'లో విడిది చేయవలసివచ్చింది. ఇక్కడ వీరు ఓ గొప్ప పాలనకు నాంది పలికారు. అయితే ఈ పాలన అంత దృఢంగా లేకపోవడం వలన త్వరలోనే పతనమై పోయింది.

కహ్‌లాన్ ఒక్కటే కాకుండా హమీర్‌కు సంబంధించిన ఓ తెగ 'ఖుజాఅ' కూడా ఒకటుంది. హమీరీ తెగ విషయంలో కొంత అభిప్రాయభేదం ఉంది. ఇది యమన్ విడిచి ఇరాఖ్‌లోని 'బాదియతుస్సమావా' అనే ప్రాంతానికి వలస పోయింది.[1]

**ముస్తారిబా అరబ్బులు :** వీరికి మూలపురుషుడు ఇబ్రాహీం అలైహిస్సలాం. ఈయన ఇరాఖ్‌లోని 'ఉర్' నగర నివాసి. ఇది ఫరాత్ నది పశ్చిమ తీరంలోని 'కూఫా' దాపులో ఉండింది. త్రవ్వకాల్లో బయల్పడిన శిలా శాసనాల్లో ఆ నగరం గురించి అనేక వివరాలు వెలుగులోనికి వచ్చాయి.

హజ్రత్ ఇబ్రాహీం (అ.స.) కుటుంబానికి చెందిన కొన్ని వివరాలు, ఆ దేశ ప్రజల ధార్మిక సామాజిక పరిస్థితులు కూడా అవగతమయ్యాయి.

హజ్రత్ ఇబ్రాహీం (అ.స.) ఇక్కడ నుండే హిజ్రత్ చేసి (వలస వెళ్ళి) 'ఖరాన్' నగరానికి చేరారు. అక్కడి నుండి ఆయన పాలస్తీనాకు వెళ్ళి దాన్ని తన దైవదౌత్య కార్యకలాపాలకు కేంద్రంగా చేసుకున్నారు. ధర్మ బోధలో నిమగ్నులై దైవ మార్గం వైపునకు ప్రజల్ని ఆహ్వానిస్తూ దేశ విదేశాల్లో తిరగసాగారు. ఓసారి

---

1. ఈ తెగలు, వాటి వలస వివరాలు 'ముహాజిరత్ తారీకుల్ ఉమమ్ ఇస్లామియా లిల్ ఖిజ్రా- 1/11-13, ఖల్బ్ జజీరతుల్ అరబ్, పేజీ. 231-235లో ఉన్నాయి. వలస సంఘటనకు సంబంధించిన కాలం, దానికి కారణాలను పరిశీలించిన తరువాత సరి అయినవిగా తోచిన వాటినే ఇక్కడ పొందుపర్చడం జరిగింది.

https://teluguislam.net



ఆయన ఈజిప్ట్‌కు కూడా వెళ్ళారు. ఈజిప్ట్ చక్రవర్తి ఫిర్‌ఔన్ (ఫారో), ఆయన(అ.స.) భార్య 'సారా'ను గురించి విని మోహంలో పడ్డాడు. అతడు ఆమెను తన దర్బారుకు చెడు తలంపుతో పిలిపించాడు. హజ్రత్ సారా ప్రార్థనను మన్నించి అల్లాహ్ ఫిర్‌ఔన్‌కు కాళ్ళుచేతులు కొట్టుకునే వ్యాధిని సంక్రమింపజేశాడు. అతని చెడు ఉద్దేశ్యం అతని ముఖానికేసి కొట్టబడింది. ఈ వ్యాధి వల్ల ఫిర్‌ఔన్‌కు ఆమె సామాన్య స్త్రీ కాదనీ, దేవుని ప్రత్యేక దాసియనీ, దైవసామీప్యంగల భక్తురాలనీ తెలిసిపోయింది. ఆమెగారి ఈ ప్రత్యేకతకు ప్రభావితుడై తన కుమార్తె[2] 'హాజిరా'ను ఆమెకు దాసీగా చేసి పంపాడు. ఆ తరువాత హజ్రత్ సారా, హజ్రత్ హాజిరాను ఇబ్రాహీం (అ.స.)కు భార్యగా చేశారు.[3]

హజ్రత్ ఇబ్రాహీం (అ.స.), హజ్రత్ సారా, హజ్రత్ హాజిరాలను వెంట బెట్టుకొని పాలస్తీనాకు తిరిగి వచ్చేశారు. ఆ తరువాత అల్లాహ్, హజ్రత్ ఇబ్రాహీం (అ.స.)కు హాజిరా గర్భం నుండి యోగ్యుడైన ఓ కుమారుడు హజ్రత్ ఇస్మాయీల్ (అ.స.)ను ప్రసాదించాడు. అయితే, సంతానంలేని హజ్రత్ సారా అభిమానం దెబ్బతిన్నది. ఆమె హజ్రత్ ఇబ్రాహీం (అ.స.)ను, హజ్రత్ హాజిరాను మరియు ఆమె పసికందునూ దేశ బహిష్కరణ చేయమని బలవంతపెట్టింది. అనివార్య పరిస్థితుల వల్ల హజ్రత్ ఇబ్రాహీం (అ.స.) హజ్రత్ సారా మాటను కాదనలేక హజ్రత్ హాజిరాను, ఆమె కుమారుడు హజ్రత్ ఇస్మాయీల్‌ను తోడ్కొని హిజాజ్ వైపు బయలుదేరవలసివచ్చింది. అక్కడ ప్రస్తుతం దైవగృహం కాబా ఉన్న ఎడారి కొండల నడుమ గల ఓ లోయలో వదిలారు. అప్పుడు దైవగృహం ఉనికే లేదు. అక్కడ కేవలం మెట్టగా ఉండే ప్రదేశం ఒకటుంది. వరద వచ్చినప్పుడు వరద నీరు ఈ మెట్టప్రాంతానికి కుడి ఎడమ వైపుల నుండి తప్పుకుపోయేవి . అక్కడే మస్జిదె హరామ్‌కు ఎగువన జమ్‌జమ్ బావి వద్ద ఓ పెద్ద వృక్షం ఉండేది. ఆయన ఆ చెట్టు దగ్గర హజ్రత్

---

2. హజ్రత్ హాజిరా ఓ బానిస స్త్రీగా చెప్పుకోవడం జరుగుతుంది. అయితే అల్లామా మన్సూర్ పూరి ఈ విషయంలో పరిశోధన చేసి ఆమె బానిస స్త్రీ కాదని ఓ స్వతంత్రురాలని రుజువు చేశారు. ఆమె ఫిర్‌ఔన్ కుమార్తెయే. *(రహ్మతుల్ లిల్ ఆలమీన్- సంపుటం: 2, పుట. 36-37)*
3. *రహ్మతుల్ లిల్ ఆలమీన్- సంపుటం: 2, పుట. 34. సంఘటన వివరాల కోసం సహీ బుఖారి సం.1, పుట. 484 చూడండి.*

https://teluguislam.net



హాజిరా, హజ్రత్ ఇస్మాయీల్ (అ.స.)లను వదిలివెళ్లారు. అప్పుడు మక్కాలో నీరుగానీ, ఆదమ్‌గానీ, ఆదమ్ సంతానంగానీ లేరు. అందుకని హజ్రత్ ఇబ్రాహీం (అ.స.) వారి కోసం పాత్రలో ఖర్జూరపు పళ్ళు, ఒక తోలు సంచిలో నీరు ఉంచి తిరిగి పాలస్తీనాకు వెళ్ళిపోయారు. కాని కొన్ని రోజుల్లోనే ఆ ఖర్జూరపు పళ్ళు, నీరూ అయిపోయి పెద్ద సంకటం ఏర్పడింది. ఆ గడ్డు పరిస్థితిలో అల్లాహ్ కారుణ్యం వల్ల జమ్‌జమ్ చెలమ పుట్టుకువచ్చింది. ఇది కొంతకాలం వరకు ఆ ఇరువురి జీవితాలను కాపాడడానికి దోహదపడిన విషయం విదితమే.[4]

కొంతకాలం గడిచిన తరువాత యమన్ నుండి ఓ తెగ అక్కడికి వచ్చింది. చరిత్రలో దాన్ని 'జుర్‌హుమ్‌సాని' (రెండవ జుర్హుం)గా చెప్పుకోవడం జరిగింది. ఈ తెగ ఇస్మాయీల్ (అ.స.) మాతృమూర్తి నుండి అనుమతి పొంది మక్కాలో నివాసం ఏర్పర్చుకుంది. ఇదివరకు ఈ తెగ మక్కా చుట్టుపట్లగల కొండ లోయల్లో నివాసం ఉంటూ ఉండేది అని ప్రతీతి. సహీ బుఖారి గ్రంథంలో ఈ తెగ మక్కాలో (నివాసమేర్పర్చుకోవడానికి) హజ్రత్ ఇస్మాయీల్ (అ.స.) రాక తరువాత ఆయన యవ్వన దశకు చేరిన మధ్యకాలంలో వచ్చారని వివరణ ఉంది. అయితే ఈ లోయ నుండి వారు ఇదివరకే తరచు వచ్చిపోతుండేవారు.[5] హజ్రత్ ఇబ్రాహీం (అ.స.) తన భార్యనూ, కుమారుణ్ణీ చూచి వెళ్ళడానికి అప్పుడప్పుడు మక్కాకు వచ్చివెళ్ళేవారు. అయితే ఆయన ఎన్ని మార్లు అక్కడికి వచ్చారో ఇతమిత్థంగా తెలియదు. అయితే చరిత్ర ఆధారంగా ఆయన నాలుగు మార్లు అక్కడికి వచ్చివెళ్ళినట్లు దాఖలాలున్నాయి.

1. దివ్యఖుర్‌ఆన్‌లో అల్లాహ్, హజ్రత్ ఇబ్రాహీం (అ.స.)కు స్వప్నంలో తన కుమారుడు (హజ్రత్ ఇస్మాయీల్ - అ.స.) ను జిబహ్ చేస్తున్నట్లు చూపించిన విషయం వివరించడం జరిగింది. ఈ స్వప్నం ఓ రకమైన దైవాదేశం. తండ్రీ కుమారులిద్దరూ ఈ ఆదేశాన్ని శిరసావహించడానికి సిద్ధమయ్యారు. వారిద్దరు దైవాదేశానికి తల ఒగ్గి, తండ్రి తన కుమారుణ్ణి బోర్లా పడవేయగా, అప్పుడు అల్లాహ్ ఆయన్ను పిలిచి, "ఓ ఇబ్రాహీం! నీవు కలను నిజం చేసి చూపించావు. సత్కార్యం చేసేవారికి మేము ఇలాంటి ప్రతిఫలాన్నే ఇస్తాము. ఇది ఓ స్పష్ట

---

4. సహీ బుఖారీ, కితాబుల్ అంబియా- 1/474, 475.
5. సహీ బుఖారీ- 1/475.

https://teluguislam.net



మైన పరీక్ష." అల్లాహ్ ఓ పెద్ద ఖుర్బానీని పరిహారంగా ఇచ్చి ఆ బాలుణ్ణి విడిపించాడు.[6]

బైబిల్ పాత నిబంధనలో హజ్రత్ ఇస్మాయిల్ (అ.స.), హజ్రత్ ఇస్హాక్ (అ.స.) కంటే పదమూడేళ్లు పెద్ద అని చెప్పబడింది. దివ్యఖుర్ఆన్ ప్రకారం, ఈ సంఘటన తరువాతనే హజ్రత్ ఇస్హాక్ (అ.స.) జననం శుభ వార్తను విని పించడం జరిగింది.

ఈ సంఘటన ద్వారా రుజువయ్యే విషయం ఏమిటంటే, హజ్రత్ ఇస్మాయిల్ (అ.స.) యవ్వన దశకు చేరకముందే కనీసం ఒకసారైనా హజ్రత్ ఇబ్రాహీం (అ.స.) మక్కాను తప్పక దర్శించి ఉంటారు. తక్కిన మూడు ప్రయాణాలను గురించిన వివరణ సహీ బుఖారీలో ఓ సుదీర్ఘ ఉల్లేఖనం ద్వారా తెలుస్తోంది. దీన్ని ఇబ్నె అబ్బాస్ (ర) ఉల్లేఖించారు.[7] దాని వివరణ ఇలా ఉంది :

2. హజ్రత్ ఇస్మాయిల్ (అ.స.) యుక్త వయస్సుకు వచ్చి జుర్హుం (తెగ) నుండి అరబీ భాష నేర్చుకున్నారు. తమకు నచ్చిన యువకుడు అయినందున ఆ తెగకు చెందిన ఓ అమ్మాయికిచ్చి పెళ్ళి చేశారు. ఆ కాలంలోనే హజ్రత్ హాజిరా (అ.స.) మరణించారు. ఇటు హజ్రత్ ఇబ్రాహీం (అ.స.) తన భార్యా కుమారుణ్ణి చూడడానికి మక్కాకు వచ్చారు. అయితే హజ్రత్ ఇస్మాయిల్ (అ.స.)ను కలవడానికి కుదరలేదు. కోడలితో పరిస్థితులేమిటని అడగ్గా ఆమె తమ దారిద్ర్యాన్ని ఏకరువు పెట్టింది. ఆయన కోడలితో, "ఇస్మాయిల్ ఇంటికి వచ్చిన తరువాత ఇంటి గడపను మార్చేయమని చెప్పు" అంటూ తిరిగి వెళ్ళిపోయారు. ఆయన మాటలకు అర్థం ఏమిటో హజ్రత్ ఇస్మాయిల్ (అ.స.) గ్రహించి భార్యకు విడాకులు ఇచ్చి మరో యువతిని పెళ్ళి చేసుకున్నారు. ఈమె జుర్హుం తెగ నాయకుడు మజాజ్ బిన్ అమ్రూ కుమార్తె.[8]

3. ఈ రెండవ పెళ్లి తరువాత హజ్రత్ ఇబ్రాహీం (అ.స.) మరోసారి మక్కాకు వచ్చారు. అయితే ఈసారి కూడా హజ్రత్ ఇస్మాయిల్ (అ.స.) ఆయన్ను కలువలేకపోయారు. కోడలితో ఇంటి పరిస్థితి గురించి వాకబు

---

6. సాఫ్ఫాత్-103-107. 7. సహీ బుఖారి-1/475-476.

8. ఖల్బ్ జజీరతుల్ అరబ్- పుట. 23.

https://teluguislam.net



చేయగా, ఆమె, (దేవుని దయ వల్ల అంతా సక్రమంగానే సాగుతుంది అని) దైవస్తోత్రం చేసింది. అప్పుడు ఇబ్రాహీం (అ.స.), "ఇంటి గడపను అలాగే ఉంచమని చెప్పు" అని తాకీదు చేసి పాలస్తీనాకు వెళ్ళిపోయారు.

4. ఆ తరువాత మళ్ళీ వచ్చినప్పుడు హజ్రత్ ఇస్మాయీల్ (అ.స.) 'జమ్‌జమ్' దాపున ఉన్న చెట్టు క్రింద బాణాలు పోతపోస్తున్నారు. తండ్రిని చూడగానే పరుగున వెళ్ళి వాటేసుకున్నారు. ఈ సందర్భంలో తండ్రీకొడుకుల పరిస్థితి ఎలా ఉంటుందో ఊహించుకోవచ్చు. ఈ కలయిక ఓ సుదీర్ఘ కాలం తరువాత జరిగింది. మృదుస్వభావుడైన, ప్రేమమయుడైన ఒక తండ్రి తన కుమారుడి నుంచి, విధేయుడైన ఒక కుమారుడు తన తండ్రి నుంచి ఇంత కాలంపాటు దూరంగా ఉండటాన్ని భరించటం ఎంతో కష్టతరమైన విషయం. తండ్రీకొడుకుల పరిస్థితి చెప్పనలవికానిది. ఆ తరువాత వారిద్దరు కలసి కాబా గృహాన్ని నిర్మించారు. పునాదులు త్రవ్వి, గోడలు పైకి లేపారు. ఇబ్రాహీం (అ.స.) ప్రపంచ ప్రజలందరనీ హజ్ కొరకు పిలిచారు.

అల్లాహ్ మజాజ్ కుమార్తె ద్వారా ఇస్మాయీల్ (అ.స.)కు పన్నెండుగురు కుమారులను ఒసిగాడు.[9] వారి పేర్లు ఇలా ఉన్నాయి. నాబిత్ లేక నబాయూత్, ఖైదార్, అద్ బాయీల్, ముబ్‌షామ్, ముష్మా, దూమా, మీషా, హదద్, తైమా, యతూర్, నఫీస్, ఖైద్‌మాన్.

ఈ పన్నెండుగురు కుమారులతో పన్నెండు తెగలు ఉనికిలోనికి వచ్చాయి. వీరంతా మక్కాలోనే స్థిరనివాసం ఏర్పరచుకున్నారు. వీరి ఉపాధి ఎక్కువగా యమన్, ఈజిప్ట్, సిరియాలతో వ్యాపారం చేయడంపైనే ఆధార పడింది. ఆ తరువాత ఈ తెగలు అరేబియా ద్వీపంలో వివిధ ప్రదేశాల్లో- ఇంకా చెప్పాలంటే - అరేబియా అవతల కూడా వ్యాపించాయి. నాబిత్, ఖైదార్ల సంతతి తప్ప తక్కిన తెగల వివరాలు, పరిస్థితులు కాలగర్భంలో కలసి పోయాయి.

నబ్తీల సంస్కృతి ఉత్తర హిజాజ్‌లో వికసించింది. వారు ఓ శక్తిమంత మైన ప్రభుత్వాన్ని స్థాపించి చుట్టుప్రక్కల ప్రజల్ని అధీనపర్చుకున్నారు. వారి రాజధాని నగరం బత్రాన్. ఎవ్వరూ వారిని ఎదిరించడానికి సాహసించే వారు కారు. ఆ తరువాత రోమనులు వచ్చి నబ్తీల పాలనను అంతమొందించారు.

---

9. ఖల్బ్ జజీరతుల్ అరబ్ పేజీ-32.

https://teluguislam.net



మౌలానా సయ్యద్ సులైమాన్ నద్వీ (రహ్మాలై) ఈ విషయాన్ని లోతుగా పరిశోధించి, 'ఆలె గస్సాన్' మరియు 'అన్సార్' అంటే అవస్ మరియు ఖజ్రజ్‌లు ఖహ్‌తానీ అరబ్బులు కాదని, వీరు ఆ ప్రాంతంలో నాబత్ బిన్ ఇస్మాయీల్ (అ.స.) సంతతిలో మిగిలిపోయిన వారి సంతానమని రుజువు చేయడం జరిగింది.[10]

ఖైదార్ బిన్ ఇస్మాయీల్ (అ.స.) సంతతి మక్కాలోనే ఉండి వికాసం పొందుతూ ఉండి పోయింది. అద్నాన్, ఆ తరువాత అతని కుమారుడు మఅద్ కాలం వచ్చేసింది. అద్నానీ అరబ్బుల సంతతి వివరాలు ఖచ్చితంగా ఇప్పటి వరకు సురక్షితంగా ఉన్నాయి.

అద్నాన్, దైవప్రవక్త (సఅసం) వంశవృక్షంలో ఇరవై ఒకటవ తరానికి చెందినవాడు. కొన్ని ఉల్లేఖనాల్లో ఆయన (స) తన వంశవృక్షాన్ని గురించి చెబుతూ అద్నాన్ వరకు వెళ్ళి ఆగిపోయేవారనీ, ఇక ముందుకు సాగిపోయే వారు కాదనీ చెప్పడం జరిగింది. వంశవృక్ష నిపుణులు చెప్పింది తప్పని ఆయన (స) చెప్పేవారు.[11] అయితే విద్వాంసుల ఓ వర్గం, అద్నాన్ కంటే పైకి కూడా ఆయన వంశ వృక్షాన్ని చెప్పవచ్చు అని అంటోంది. వారు ఈ ఉల్లేఖనాన్ని జయీఫ్ (బలహీనం) అయినదిగా ఖరారు చేస్తారు. వీరి పరిశోధన ప్రకారం, అద్నాన్ మరియు హజ్రత్ ఇబ్రాహీం (అ.స.) నడుమ నలభై తరాలున్నాయి.

మొత్తానికి మఅద్ కుమారుడు నజార్ - నజార్ తప్ప మఅద్‌కు వేరే - సంతానంలేదు. అతని ద్వారా ఎన్నో కుటుంబాలు ఉనికిలోనికి వచ్చాయి. నిజానికి నజార్‌కు నలుగురు కుమారులు. ప్రతి కుమారుడు ఓ పెద్ద తెగకు మూలపురుషుడయ్యాడు. ఈ నలుగురి పేర్లు ఇలా ఉన్నాయి: ఇయాద్, అన్మార్, రబీయా, ముజర్. వీరిలో చివరి రెండు తెగల శాఖలు, ఆ శాఖలకు ఉప శాఖలు అనేకం పెరిగిపోయాయి. కాబట్టి రబీయా ద్వారా అసద్ బిన్ రబీయా, గజ్జా, అబ్దుల్ ఖైస్, వాయిల్, బకర్, తగ్లబ్, బనూ హనీఫా వగైరాలు ఉనికిలోనికి వచ్చాయి. ముజర్ సంతానం రెండు పెద్ద తెగల్లో విడిపోయింది.

1. ఖైస్ ఈలాన్ బిన్ ముజర్. 2. ఇల్యాస్ బిన్ ముజర్.

ఖైస్ ఈలాన్ ద్వారా బనూ సలీం, బనూ హవాజిన్, బనూ గత్ఫాన్. గత్ఫాన్ ద్వారా అబస్, జీబాన్, అష్జా మరియు గనీ బిన్ ఆసుర్ తెగలు ఉనికిలోనికి వచ్చాయి.

---

*10. చూడండి. తారీఖె అర్జుల్ ఖుర్ఆన్-2/78-86.*

*11. తిబ్రీ : తారీఖుల్ ఉమమ్ వల్ ములూక్-2 /191-194, అల్ ఎలామ్- 5/6.*

https://teluguislam.net



ఇల్యాస్ బిన్ ముజర్ ద్వారా తమీమ్ బిన్ ముర్రా, హుజైల్ బిన్ ముద్రికా, బనూ అసద్ బిన్ హుజైమా తెగలు పుట్టాయి. కినానా ద్వారా ఖురైష్ తెగ ఉనికి లోనికి వచ్చింది. ఈ తెగ ఫహర్ బిన్ మాలిక్ బిన్ నద్ర్ బిన్ కినానా సంతానం.

ఖురైష్ కూడా వివిధ శాఖల్లో విడిపోయారు. ప్రసిద్ధ ఖురైషీ శాఖల పేర్లు ఇలా ఉన్నాయి: జమ్‌హా, సహమ్, అద్దీ, మగ్జూమ్, తైమ్, జుహ్రా మరియు ఖుసై బిన్ కిలాబ్ కుటుంబాలు. అంటే అబ్దుద్దార్, అసద్ బిన్ అబ్దుల్ ఉజ్జా మరియు అబ్దె మునాఫ్‌లన్న మాట. ఈ ముగ్గురు ఖుసై కుమారులు. వీరిలో అబ్దె మునాఫ్‌కు నలుగురు కొడుకులు. వీరి ద్వారా ఉపశాఖలు ఉనికిలోనికి వచ్చాయి. అంటే అబ్దెషమ్స్, నౌఫిల్, ముత్తలిబ్ మరియు హాషిమ్. ఈ హాషిమ్ వంశం నుండే అల్లాహ్ మహాప్రవక్త ముహమ్మద్ (స)ను ఎంచుకున్నాడు.[12]

దైవప్రవక్త (స) ప్రవచనం ఇలా ఉంది:

"అల్లాహ్ ఇబ్రాహీం (అ.స.) సంతానం నుండి ఇస్మాయీల్ (అ.స.) ను ఎన్నుకున్నాడు. తరువాత ఇస్మాయీల్ (అ.స.) సంతానం నుండి కినానాను ఎంపిక చేశాడు. కినానా సంతతి నుండి ఖురైష్‌ను ఎన్నుకున్నాడు. ఖురైష్ నుండి బనూ హాషిమ్‌ను ఎంచుకున్నాడు. బనూ హాషిం నుండి నన్ను ఎంచు కున్నాడు."[13]

ఇబ్నె అబ్బాస్ కథనం ప్రకారం, దైవప్రవక్త (స) ఇలా సెలవిచ్చారు: "అల్లాహ్ సృష్టి రచన చేసి నన్ను అతి మేలైన వర్గంలో పుట్టించాడు. రెండు మేలు వర్గాల్లోనూ మిన్న అయిన వర్గంలో ఉంచాడు. తెగలను ఎంచు కున్నప్పుడు నన్ను అన్నిటికంటే మేలైన తెగలో చోటిచ్చాడు. వంశాలను ఎంపిక చేసినప్పుడు నన్ను అతి మేలైన వంశంలో పుట్టించాడు. కాబట్టి నేను నా వ్యక్తిత్వం రీత్యా కూడా అందరికంటే మేలైనవాణ్ణి మరియు వంశం రీత్యా అందరికంటే మిన్న అయిన వంశం వాణ్ణి.[14]

మొత్తానికి అద్‌నాన్ వంశం బాగా వృద్ధిచెందినప్పుడు అన్నపానీయాల సముపార్జన వేటలో అరేబియాలోని వివిధ ప్రాంతాల్లో వ్యాపించింది. ఉదాహ రణకు అబ్దుల్ ఖైస్ తెగ, బక్ర్ బిన్ వాయిల్‌కు చెందిన అనేక శాఖలు మరియు బనూ తమీమ్ కుటుంబాలు బహ్రైన్ వైపునకు బయలుదేరి వెళ్ళాయి. ఆ ప్రాంతంలోనే స్థిరపడ్డాయి.

---

12. ముహాజిరాతె ఖిజ్రీ-1/14-15.

13. సహీ ముస్లిం-2/245; జామె తిర్మిజీ-2 /201. 14. తిర్మిజీ-2/201.

https://teluguislam.net



బనూ హనీఫా బిన్ సఅబ్ బిన్ అలి బిన్ బక్ర్ యమామా వైపునకు వెళ్ళి దాని కేంద్ర ప్రాంతమైన 'హిజ్ర్'లో స్థిరపడిపోయారు.

బక్ర్ బిన్ వాయిల్‌కు చెందిన మిగిలిన శాఖలు యమామా నుండి బహ్రైన్, 'కాజిమా తీరం', 'అఖాతం', 'సువాదె ఇరాఖ్', 'ఉబ్లా' మరియు 'హైత్' వరకు వ్యాపించి ఉన్న ప్రాంతాల్లో స్థిరపడ్డాయి.

బనూ తగ్లబ్ ఫరాతియా దీవిలో స్థిరపడింది. అయితే దానికి చెందిన కొన్ని శాఖలు బనూ బక్ర్ తెగ వెంట ఉండిపోయాయి.

బనూ తమీమ్ బాదియా బస్రాలో స్థిరపడింది.

బనూ సలీం మదీనా దాపున విడిది చేసింది. వారి నివాస ప్రాంతం వాదియుల్ ఖుర్అ (ఖుర్అ లోయ) మొదలుకొని ఖైబర్, మదీనాకు తూర్పు భాగం అయిన హుర్రా బనూ సలీం ప్రక్కనే ఉన్న రెండు కొండల వరకు విస్తరించింది.

బనూ సఖీఫ్ తెగవారు తాయిఫ్‌లో ఉండిపోయారు. బనూ హవాజిన్ మక్కా తూర్పున అవుతాస్ లోయకు చుట్టుపట్ల విడిది చేశారు. వీరి నివాస స్థలం మక్కా - బస్రా రాజమార్గంపై ఉండింది.

బనూ అసద్ తైమాకు తూర్పున మరియు కూఫాకు పశ్చిమాన స్థిర పడ్డారు. వీరి నివాసానికి తైమాకు నడుమ బనూ తైకు చెందిన ఓ తెగ బహ్తూర్ కూడా ఉండేది. బనూ అసద్ నివసించిన ప్రాంతానికి, కూఫాకు నడుమ ప్రయాణ దూరం అయిదు రోజులు.

బనూ జుబ్యాన్ తెగవారు తైమాకు దరిదాపులోవున్న 'హౌరాన్' చుట్టు ప్రక్కల స్థిరపడ్డారు.


తిహామాలో బనూ కినాన వంశం ఉండి పోయింది. వారిలో ఖురైషీ వంశం మక్కా మరియు ఆ చుట్టుపట్ల నివాసమేర్పర్చుకుంది. వీరు సంఘటి తంగా ఉండకుండా దేశదిమ్మరుల్లా తిరిగేవారు. చివరికి ఖుసై బిన్ కిలాబ్ ఖురైషీలందరిని సంఘటితం చేసి వారికి గౌరవాన్నీ, ఔన్నత్యాన్నీ కల్పించాడు.[15]

---

15. ముహాజిరతె ఖిజ్రీ-1/15,16.

https://teluguislam.net






గీతలు ఉన్నవి ప్రదేశం పేర్లు

గీతలు లేనివి తెగల పేర్లు

మహాప్రవక్త(స) రాక పూర్వం అరేబియా ప్రాంతాలు

https://teluguislam.net

# అరబ్బు రాజ్యాలు - నాయకత్వాలు

https://teluguislam.net



# అరబ్బు రాజ్యాలు - నాయకత్వాలు

ఇస్లామ్ ఆవిర్భావానికి పూర్వం గల అరేబియా పరిస్థితులను చర్చించు కునేటప్పుడు అచటి పాలనలు, నాయకత్వాలు, మతాలను గురించిన ఓ స్థూల చర్చ కూడా జరగడం సమంజసమేమో. దీని ద్వారా ఇస్లామ్ శుభోదయ మయ్యేటప్పుడు ఉన్న పరిస్థితి ఏమిటో సులభంగా గ్రహించడానికి వీలు పడుతుంది.

అరేబియా ద్వీపంపై ఇస్లామ్ భానుకిరణాలు ప్రసరించినప్పుడు, అక్కడ రెండు రకాల పాలకులు ఉండేవారు. వారిలో ఒకరు కిరీటధారులైన రాజులు. వారు పూర్తిగా స్వతంత్రులుగా, సార్వభౌములుగా ఉన్న రాజులు కారు. రెండో రకం పాలకులు అక్కడి తెగల సర్దారులు. వీరు అధికారాలు, గౌరవప్రతిపత్తులల్లో కిరీటధారులైన రాజులకంటే ఏమీ తీసిపోయేవారు కాదు. పైగా వీరు పూర్తిగా స్వతంత్రులు, సార్వభౌమాధికారం గలవారు. కిరీటధారులైన రాజుల్లో యమన్ రాజులు, ఆలె గస్సాన్ రాజులు (సిరియా), హీరా రాజులు (ఇరాఖ్). మిగిలిన అరబ్బు పాలకులంతా కిరీటధారులు కారు.

## యమన్ రాచరికం

ఆరిబా అరబ్బుల్లో తెలిసిన అతి పురాతన జాతి 'సబా' జాతి ఒక్కటే. ఉర్ (ఇరాఖ్)లో బయటపడ్డ శిలాశాసనాల్లో, క్రీస్తుకు పూర్వం రెండు వేల సంవత్సరాల క్రితం దాని గురించిన వివరాలు లభ్యమయ్యాయి. అయితే, సబా జాతి అభివృద్ధి వికాసాల కాలం క్రీస్తుకు పూర్వం పదకొండు వందల ఏళ్ళ నుండి ప్రారంభం అయింది. దాని చరిత్రకు సంబంధించిన ముఖ్యమైన శకాలు ఇలా ఉన్నాయి.

1. క్రీ.పూ. 650వ సంవత్సరం నుండి మొదటి శకం ప్రారంభ మయింది. ఈ శకంలో సబా రాజుల బిరుదు 'మక్రబె సబా' అని ఉండేది. వారి రాజధాని సర్వాహ్ నగరం. ఈ రాజధాని శిథిలాలు నేటికీ మారిబ్ నగరానికి పశ్చిమాన

https://teluguislam.net



ఒక రోజు ప్రయాణ దూరంలో ఉన్నాయి. ఇవి ఖరీబా పేరున ఖ్యాతి నొందాయి. ఈ శకంలోనే మారిబ్ నగరానికి చెందిన ప్రసిద్ధమైన ఆనకట్ట పునాదులు వేయబడ్డాయి. యమన్ చరిత్రలో దీనికి గొప్ప ప్రాముఖ్యత ఉంది. ఈ కాలంలోనే సబా సామ్రాజ్యానికి వృద్ధీవికాసాలు లభించాయియని, వారు అరేబియాలోనూ, అరేబియాకు అవతల కూడా తమ క్రొత్త ఆవాసాలను నిర్మించుకున్నారు.

2. క్రీ.పూ. 650 నుండి 115 సంవత్సరాల వరకు సాగిన శకంలో సబా రాజులు తమ బిరుదైన 'మక్రబ్'ను విడనాడి క్రొత్త బిరుదు 'మలిక్' (చక్రవర్తి)గా పెట్టుకున్నారు. సర్వాహ్‌కు బదులు మారిబ్‌ను తమ రాజధానిగా చేసుకొని పరిపాలించారు. ఈ నగరం శిథిలాలు నేటికీ 'సన్‌ఆ'కు తూర్పున అరవై మైళ్ళ దూరాన ఉన్నాయి.

3. క్రీ.పూ. 115 నుండి క్రీ.శ. 300 వరకు సాగిన శకంలో సబా సామ్రాజ్యంపై హిమ్యైర్ తెగకు అధికారం లభించింది. అది మారిబ్‌కు బదులు 'రైదాన్'ను తమ రాజధాని నగరంగా చేసుకొని పరిపాలించింది. ఆ తరువాత రైదాన్ పేరు కాస్తా జిఫార్‌గా మారిపోయింది. దీని శిథిలాలు నేటికీ యరీమ్ నగరం సమీపాన ముదవ్వర్ కొండపై కనబడతాయి.

ఈ శకం నుండే సబా సామ్రాజ్య పతనం ఆరంభమైంది. మొదట నబ్తీలు ఉత్తర హిజాజ్‌పై తమ అధికారాన్ని నెలకొల్పుకొని సబా జాతిని వారి క్రొత్త ఆవాసాల నుండి వెళ్ళగొట్టారు. ఆ తరువాత రోమనులు ఈజిప్ట్, సిరియా, ఉత్తర హిజాజ్‌లను ఆక్రమించుకొని వ్యాపారం చేసుకునేవారి సముద్ర మార్గాలను మూసివేశారు. ఇలా వారి వ్యాపారం క్రమక్రమంగా క్షీణించి పూర్తిగా దెబ్బతినిపోయింది. అటు ఖహ్‌తానీ తెగలు పరస్పరం కలహించుకో సాగాయి. ఈ పరిస్థితుల ఫలితంగా ఖహ్‌తానీ తెగలు తమ ప్రాంతాలను వదిలేసి దేశదిమ్మరులై తిరుగనారంభించారు.

4. క్రీ.శ. 300వ సంవత్సరం నుండి ఇస్లామ్ ధర్మం ప్రారంభకాలం వరకు సాగిన శకంలో యమన్‌లో అశాంతి, అరాచకం రాజ్యమేలింది. విప్లవాలు వచ్చాయి. అంతర్యుద్ధాలు జరిగాయి. విదేశీ జాతులు హస్తక్షేపం చేయడానికి మార్గం సుగమమైంది. చివరికి యమన్‌వాసుల స్వాతంత్ర్యం హరించబడే రోజు కూడా వచ్చేసింది. ఈ శకంలోనే రోమనులు అద్‌నాన్‌పై సైనికాధికారాన్ని

https://teluguislam.net



నెలకొల్పారు. హమీర్ మరియు హమ్దానుల మధ్య గల కలహాలను ఆసరాగా చేసుకొని రోమనుల అండదండలతో అబీసీనియనులు, క్రీ.శ. 340లో మొదటిసారిగా యమన్‌ను వశపర్చుకున్నారు. వీరి అధికారం క్రీ.శ. 378 వరకు కొనసాగింది. ఆ తరువాత యమన్ స్వాతంత్ర్యం తిరిగి పునరుద్ధరించ బడినప్పటికీ మారిబ్ నగరంలోని ప్రసిద్ధ ఆనకట్టలో బీటలు పడనారంభించాయి. చివరికి అది క్రీ.శ. 450 లేదా 451వ సంవత్సరంలో తెగిపోయింది. ఫలితంగా వచ్చిన వరదల వల్ల అనేక గ్రామాలు కొట్టుకుపోయాయి. ఆ భయానక వరదలు 'సైలెఇరమ్' గా ఖుర్‌ఆన్‌లో సూరె 'సబా'లో ప్రస్తావించ బడింది. ఈ వరదల్లో అనేక తెగలు చెల్లాచెదురైపోయాయి.

ఆ తరువాత తిరిగి క్రీ.శ.523లో ఘోరమైన మరో ప్రమాదం ముంచుకొచ్చింది. అదేమిటంటే, యమన్‌కు చెందిన యూదు రాజు 'జూనవాస్' నజ్రాన్ క్రైస్తవులపై భీకరమైన దాడి చేసి వారిని క్రైస్తవ మతం వదిలిపెట్టడానికి బలవంతపెట్టాడు. వారు దాన్ని అంగీకరించకపోవడంతో, జూనవాస్, అగ్ని గుండాలు రగిల్చి అందులో వారిని మూకుమ్మడిగా పడవేసి కాల్చి చంపాడు. దివ్య ఖుర్‌ఆన్ బురూజ్ సూరాలో ఈ భయంకరమైన మారణకాండకు సంబంధించిన సూచన ఇవ్వడం జరిగింది. ఈ సంఘటన ఫలితంగా, ఇదివరకే రోమను బాదుషాల అండదండలతో అరేబియాను వశపర్చుకోవడానికి ప్రయత్నం చేస్తున్న క్రైస్తవం, యూదుల ఆగడాల పగ తీర్చుకోవడానికి అబీసీనియా నీగ్రోలను యమన్‌పై దండెత్తడానికి ప్రోత్సహిస్తూ వారికి నౌకా దళాన్ని సమకూర్చింది. అబీసీనియనులు రోమనుల సహాయంతో క్రీ.శ. 525లో 'అరియాత్' నాయకత్వంలో డెబ్భై వేల సైన్యంతో యమన్‌ను తిరిగి వశపర్చుకున్నారు. ఆ ఆక్రమణలో ప్రథమ ఘట్టంగా అబీసీనియా రాజుకు గవర్నరుగా 'అరియాత్' యమన్‌ను పాలించాడు. అయితే ఆ తరువాత ఆ సైన్యానికి చెందిన ఓ క్రింది స్థాయి కమాండరు 'అబ్రహా' అతణ్ణి హతమార్చి అధికారాన్ని చేపట్టాడు. అబీసీనియా రాజును తన ఈ నిర్వాకానికి సంతృప్తి పడేటట్లు చేశాడు.

ఇతనే కాబా గృహాన్ని పడగొట్టే ప్రయత్నం చేసిన 'అబ్రహా'. ఓ పెద్ద సైన్యమే కాక ఏనుగుల్ని కూడా దండెత్తడానికి వెంట తీసుకొచ్చిన కారణంగా ఈ సైన్యపటాలం 'అస్హాబె ఫీల్' (ఏనుగుల దండు)గా ప్రఖ్యాతిగాంచింది.

https://teluguislam.net



ఫీల్ సంఘటనలో అబీసీనియన్లకు పట్టిన గతి ద్వారా ప్రయోజనం పొందుతూ యమన్ ప్రజలు పర్షియా రాజు సహాయంతో అబీసీనియన్లకు వ్యతిరేకంగా తిరుగుబాటు ప్రారంభమైంది. ఇలా 'సైఫ్‌జీ యజన్' కుమారుడు మఅద్ యక్రబ్ నాయకత్వంలో అబీసీనియనులను దేశం నుండి పారద్రోల గలిగారు. ఓ స్వతంత్ర జాతిగా వారు 'మఅద్ యక్రబ్'ను తమ రాజుగా ఎన్ను కోవడం జరిగింది. ఇది క్రీ.శ. 575లో జరిగిన సంఘటన.

స్వాతంత్ర్యం వచ్చాక 'మఅద్ యక్రబ్' కొందరు అబీసీనియనులను తన సేవ కోసం, మరికొందరిని రాచదర్పం కోసం తన వెంట ఉంచుకోవడం జరి గింది. అయితే ఇది అతని పాలిట శాపమైంది. ఓ రోజు వారు మోసం చేసి మఅద్ యక్రబ్‌ను హత్యచేసి జీయజన్ కుటుంబం నుంచి అధికార దీపాన్ని శాశ్వతంగా ఆర్పివేశారు. ఇటు కిస్రా (పర్షియా చక్రవర్తి) పరిస్థితిని ఆసరాగా తీసుకొని 'సన్ఆ'ను వశపర్చుకొని అక్కడ ఓ పర్షియా జాతి గవర్నరును నియ మించి యమన్‌ను పర్షియాకు చెందిన ఓ రాజ్యంగా ప్రకటించాడు. ఆ తరు వాత యమన్‌లో పర్షియాకు చెందిన గవర్నర్లు ఒకరి తరువాత ఒకర్ని నియ మించడం జరిగింది. చిట్టచివరి గవర్నరు బాజాన్, క్రీ.శ. 628లో ఇస్లామ్ స్వీక రించాడు. దానితో యమన్ పర్షియా అధికారం నుండి బయటపడి ఇస్లాం సామ్రాజ్యంలో చేరిపోయింది.[1]

## హీరా రాచరికం

ఇరాఖ్, దాని చుట్టుప్రక్కల ప్రాంతంపై 'కోర్‌విష్ కబీర్' (కోరస్ లేక సైరస్ జుల్ కర్నైన్ క్రీ.పూ. 557 -529) కాలం నుండే పర్షియనుల అధికారం సాగుతూ ఉండేది. అది శక్తిమంతమైన సామ్రాజ్యం గనక దాన్ని ఎదిరించే ధైర్యం ఎవరికీ లేకపోయింది. చివరికి క్రీ.పూ. 326లో మెసిడోనియాకు చెందిన 'అలెగ్జాండర్', మొదటి 'దారా'ను ఓడించి పర్షియనులను నిర్వీర్యం చేశాడు. ఫలితంగా దేశం

---

1. *సయ్యద్ సులైమాన్ నద్వి తన గ్రంథం తారీఖ్ అర్జె ఖుర్ఆన్ 1/133 నుండి గ్రంథం చివరి వరకు అనేక చారిత్రక ఆధారాల వెలుగులో సబా జాతి గురించిన వివరాలు ఎంతో వివరంగా రాశారు. మౌలానా మౌదూది (రహ్మాలై) తఫ్హీ ముల్ ఖుర్ఆన్ 4/195-198లోను కొన్ని వివరాలను ఏకరువుపెట్టారు. అయితే చారిత్రక ఆధారాలు, శకాల విషయంలో అభిప్రాయభేదాలున్నాయి. కొందరు పరిశోధకులు మాత్రం ఈ వివరాలను కట్టుకథలుగా ఖరారు చేశారు.*

https://teluguislam.net



ముక్కచెక్కలైపోయి రాజకీయ అస్థిరత ఏర్పడింది. ఈ అస్థిరత క్రీ.శ. 230 వరకు కొనసాగింది. ఈ కాలంలోనే ఖహ్తానీ తెగలు దేశాన్ని వదిలి ఇరాఖ్‌కు సంబంధించిన సారవంతమైన సరిహద్దు ప్రాంతాల్లో స్థిరపడ్డారు. ఆ తరువాత 'అద్నానీ' కాందిశీకులు వచ్చి పోరాడి ఫరాతియా దీవిని తమ స్థిరనివాసంగా ఏర్పర్చుకున్నారు.

ఇటు క్రీ.శ. 226లో 'అర్దషీర్' సాసానీ రాజ్యస్థాపన చేసినప్పుడు పారశీకులు తమ బలాన్ని క్రమక్రమంగా పుంజుకోనారంభించారు. అర్దషీర్ పర్షియనులను సంఘటితం చేసి తన దేశ సరిహద్దుల్లో ఉన్న అరబ్బులను ఓడించాడు. దీని ఫలితంగానే 'ఖుజాఅ' తెగ సిరియా వైపునకు వెళ్ళిపోయింది. 'హీరా' మరియు 'అంబార్' అరబ్బులు కప్పం కట్టడానికి సిద్ధపడ్డారు.

అర్దషీర్ పరిపాలనా కాలంలో బాదియతుల్ అరబ్ మరియు ద్వీపానికి చెందిన రబీయా, ముజరీ తెగలపై జజీమతుల్ వజాహ్ పెత్తనం సాగుతూ ఉండేది. బహుశా అరబ్బులపై నేరుగా పరిపాలన సాగించడం, వారిని సరిహద్దుల దోపిడీల నుండి వారించడం సాధ్యం కాదని, వారి తెగలోనే బాగా పలుకుబడి ఉన్న నాయకుణ్ణి పాలకునిగా చేస్తే తప్ప ఇది సాధ్యమయ్యే విషయం కాదని అర్దషీర్ తలచి ఉండవచ్చు. దీని వల్ల ఓ ప్రయోజనం కూడా ఉంది. అవసరమైనప్పుడు రోమనులకు వ్యతిరేకంగా వారి సహాయాన్ని తీసుకోవచ్చు. అదే కాకుండా సిరియాకు చెందిన రోమ్ అనుయాయ అరబ్బులకు వ్యతిరేకంగా వీరిని నిలబెట్టనూవచ్చు. హీరా రాజుల వద్ద పర్షియా సైన్యపు ఓ విభాగం ఎల్లప్పుడూ ఉండేది. ఇది దోపిడీలకు పాల్పడుతూ ఎడారిలో తిరిగే అరబ్బులను అణచివేస్తూ ఉండేది.

సుమారు క్రీ.శ. 268లో జజీమా మరణించాడు. అతని స్థానంలో అమ్రూ బిన్ అద్దీ బిన్ నస్ర్ లక్మీ పట్టాభిషిక్తుడయ్యాడు. ఇతను లక్మ్ తెగకు చెందిన మొదటి పాలకుడు. ఇతను షాపూర్, అర్దషీర్ల సమకాలికుడు. ఇతని తరువాత ఖుబాజ్ బిన్ ఫిరోజ్ పరిపాలనా కాలం వరకు హీరాపై లక్మీల ఎడతెగని పాలన కొనసాగింది. ఖుబాజ్ కాలంలో 'ముజ్వక్' పైకి వచ్చాడు. ముజ్వక్ 'అబాహి' మత (ఒక విధమైన భౌతికవాదం) అనుయాయి. ఖుబాజ్, అతనికి సంబంధించిన అనేకులు ముజ్వక్‌ను అనుసరించారు. ఆ తరువాత ఖుబాజ్, హీరా రాజైన 'మున్జర్ బిన్ మాఉస్సమా'కు లేఖ రాస్తూ ఈ మతాన్నే

https://teluguislam.net



అవలంబించమని సందేశం పంపించాడు. ముస్జర్ గొప్ప ఆత్మాభిమాని అయి నందున దీన్ని నిరాకరించాడు. ఫలితంగా ఖుబాజ్ అతణ్ణి పదవీచ్యుతునిగా చేసి అతని స్థానంలో ముజ్దక్ మతావలంబీకుడైన 'హారిస్ బిన్ అమ్రూ బిన్ హిజ్ర్ కిందీ' ని హీరాకు రాజుగా చేశాడు.

ఖుబాజ్ తరువాత పర్షియా పగ్గాలు 'కిస్రా నౌషీర్వాన్' చేతికి వచ్చాయి. అతనికి ఈ మతం అంటే గిట్టదు. అతను ముజ్వక్‌ను, అతని అనుయాయులు అనేక మందిని చంపించాడు. ముస్జర్‌ను తిరిగి హీరా పాలకునిగా చేసి హారిస్ బిన్ అమ్రూను బంధించి తెమ్మని ఆదేశాలిచ్చాడు. అయితే అతను బనూ కల్బ్ తెగకు చెందిన ప్రాంతానికి పారిపోయి అక్కడనే తన శేష జీవితాన్ని గడిపాడు.

ముస్జర్ బిన్ మాఉస్సమా తరువాత నోమాన్ బిన్ ముస్జర్ కాలం వరకు హీరా పాలన, ఆయన వంశంలోనే కొనసాగుతూ వచ్చింది. తదుపరి జైద్ బిన్ అద్దీ అనేవాడు నోమాన్ బిన్ ముస్జర్‌కు వ్యతిరేకంగా కిస్రాకు అబద్ధాలు నూరి పోయడం వలన కిస్రా అగ్గి మీద గుగ్గిలమై నోమాన్‌ను తన దర్బారుకు పిలిపించాడు. నోమాన్ ఎవ్వరికీ తెలియకుండా బనూ షైబాన్ సర్దారైన హాని బిన్ మస్ఊద్ వద్దకు వెళ్ళి తన కుటుంబ సభ్యుల్ని, సంపదను అతని వద్ద అమానుతుగా ఉంచి కిస్రా వద్దకు వెళ్ళాడు. కిస్రా అతణ్ణి ఖైదు చేయగా ఖైదీగానే అతను మరణించాడు.

కిస్రా, నోమాన్‌ను ఖైదు చేసిన తరువాత అతని స్థానంలో 'ఇయాస్ బిన్ ఖబీసా తాయీ'ని పాలకునిగా చేసి, హాని బిన్ మస్ఊద్ నుండి నోమాన్ అమానతును తీసుకురమ్మని ఆదేశించాడు. హాని ఆత్మాభిమాని కావడం వలన అమానతు ఇవ్వనని నిరాకరించడమే కాకుండా యుద్ధం ప్రకటించాడు. ఇంకేముంది! ఇయాస్ తన వెంట కిస్రా సైన్యాన్ని, సరిహద్దు రాష్ట్రాల గవర్నర్లను వెంటబెట్టుకొని బయలుదేరాడు. 'జీఖార్' యుద్ధ మైదానంలో ఇరు సేనల నడుమ భీకర యుద్ధం జరిగింది. ఈ యుద్ధంలో బనూషైబాన్ విజయం పొందాడు. పారసీకులు ఘోరపరాజయం పాలయ్యారు. అరబ్బులు అరబ్బేతరులపై విజయం సాధించిన మొట్టమొదటి సంఘటన ఇది. ఈ సంఘటన దైవప్రవక్త (స) జన్మించిన కొన్ని రోజుల తరువాత జరిగింది. ఆయన (స) 'ఇయాస్' హీరాకు రాజైన ఎనిమిదవ నెలలో జన్మించారు.

ఇయాస్ తరువాత కిస్రా 'హీరా' పాలన కోసం ఓ పర్షియా పాలకుణ్ణి

https://teluguislam.net



నియమించాడు. అయితే క్రీ.శ. 632లో 'లక్మీ'లు తిరిగి అధికారంలోనికి వచ్చేశారు. మున్జిర్ బిన్ మార్యూర్ తెగకు చెందిన ఓ వ్యక్తి హీరా పాలకు డయ్యాడు. కాని ఇతను అధికారంలోనికి వచ్చిన ఎనిమిది నెలలలోనే హజ్రత్ ఖాలిద్ బిన్ వలీద్ (రజిఅన్) ఇస్లాం సైన్యంతో హీరాలో ప్రవేశించారు.

## సిరియా రాచరికం

అరబ్బు తెగలు విరివిగా వలసపోయే కాలంలో, 'ఖుజాఅ' తెగకు చెందిన కొన్ని శాఖలు సిరియా సరిహద్దుల్లోకి వెళ్ళి అక్కడ స్థిరపడ్డాయి. వీరు 'బనీ సలీం బిన్ హల్వాన్'కు సంబంధించినవారు. వారిలోనే ఓ తెగ బనూ జజ్అమ్ బిన్ సలీం ఒకటి. ఇది 'జజాయిమా'గా పేరుగాంచింది. ఖుజాఅకు చెందిన ఈ శాఖను రోమనులు, అరేబియా ఎడారికి చెందిన బిద్దూల (పామరుల) దోపిడీని అడ్డుకోవడానికి, పర్షియనులకు వ్యతిరేకంగా వాడుకోవడానికి అండదండలను అందిస్తూ, ఈ శాఖకు చెందిన ఓ వ్యక్తినే పాలకునిగా ప్రకటించారు. ఆ తరువాత చాలా కాలం వరకు ఈ పాలన కొనసాగింది. వీరిలో ప్రఖ్యాతిగాంచిన రాజు "జయ్యాద్ బిన్ హెవలా." జజాయిమా పరిపాలనా కాలం పూర్తిగా క్రీ.శ. రెండవ శతాబ్దం వరకు కొనసాగిందని అంచనావేయడం జరిగింది. ఆ తరువాత ఈ రాజ్యం 'ఆలె గస్సాన్" హస్తగతమై జజాయిమా పరిపాలన పూర్తిగా అంతమైపోయింది. ఆలె గస్సాన్, బనూ జజ్అమ్‌ను ఓడించి పూర్తి రాజ్యాన్ని వశపర్చుకున్నారు. ఈ పరిస్థితిని గమనించిన రోమనులు, వారినే జజాయిమా స్థానంలో సిరియాలోని అరబ్బులకు రాజుగా గుర్తించారు. ఆలె గస్సాన్ రాజధాని 'దూమతుల్ జందల్'. రోమనుల కీలుబొమ్మలుగా ఆలె గస్సాన్ సిరియాను పాలిస్తూ వచ్చారు. చివరికి ఉమర్ (ర) గారి ఖిలాఫత్ హి.శ. 13లో యర్మూక్ యుద్ధంలో ఆలె గస్సాన్ చివరి రాజు అయిన 'జబ్లా బిన్ అయిహం' ఇస్లామ్ స్వీకరించాడు.[2] ఇతని గర్వం ఇస్లామీయ సమానత్వ సిద్ధాంతాన్ని భరించక తిరిగి అతను ఇస్లామ్ ధర్మాన్ని విడిచిపెట్టాడు.

## హిజాజ్ రాచరికం

మక్కాలో హజ్రత్ ఇస్మాయిల్ (అ.స.) కాలం నుండే ప్రజలు వచ్చి స్థిర పడిన విషయం మనకు తెలిసినదే. ఆయన 137 సంవత్సరాల వరకు

---

*2. ముహాజిరాత్ ఖిజ్రీ-1/34; తారీఖ్ అర్దుల్ ఖుర్ఆన్-2/80-82.*

https://teluguislam.net



జీవించారు.[3] బ్రతికి ఉన్నంత వరకు బైతుల్లా (కాబా గృహం) సంరక్షకులుగా ఉన్నారు[4]. ఆయన తరువాత ఆయన కుమారులు 'నాబిత్', ఆ తరువాత ఖైదార్, తదుపరి నాబిత్, ఒకరి తరువాత మరొకరు మక్కాకు పాలకులుగా ఉంటూ వచ్చారు. వారి తరువాత 'నానాముజాజ్ బిన్ అమ్రూ జుర్హమీ' పాలనా పగ్గాలను తన చేతిలోనికి తీసుకున్నాడు. ఇలా మక్కా పాలన బనూ జుర్హుమ్ చేతిలోనికి వచ్చింది. చాలా కాలం వరకు అధికారం వారి చేతుల్లోనే ఉండిపోయింది. హజ్రత్ ఇస్మాయీల్ (అ.స.) (తన తండ్రిగారైన ఇబ్రాహీం (అ.స.)తో కలిసి) బైతుల్లాహ్‌ను నిర్మించారు కాబట్టి ఆయన సంతానానికి గౌరవ స్థానం దక్కుతూ వచ్చింది. అయితే అధికారంలో మాత్రం వారికి ఎలాంటి ప్రమేయం లేకపోయింది.[5]

అలా కాలం గడిచినకొద్దీ హజ్రత్ ఇస్మాయీల్ (అ.స.) సంతానం మరుగున పడుతూ వచ్చింది. చివరికి 'బుఖ్తనస్సర్' పైకి వచ్చిన కొంతకాలానికి పూర్వమే బనూ జుర్హుమ్ శక్తి క్షీణించి, మక్కా దిజ్మండలంపై అద్నాన్ రాజకీయ నక్షత్రం ప్రకాశించసాగింది. దీనికి ఆధారం ఏమిటంటే బుఖ్తనస్సర్, జాతె ఇరాఖ్‌లో అరబ్బులతో చేసిన యుద్ధంలో అరబ్బుల సైన్యాధ్యక్షుడు జుర్హుం తెగకు సంబంధించినవాడు కాకపోవడం.[6]

తరువాత బుఖ్తనస్సర్ క్రీ.పూ. 587లో మరో దాడి చేసినప్పుడు బనూ అద్నాన్ వంశం వారు పారిపోయి యమన్ చేరారు. ఆ కాలంలో బనీ ఇస్రాయీల్‌కు హజ్రత్ యర్మియాహ్ ప్రవక్తగా ఉండేవారు. ఆయన అద్నాన్ కుమారుడు 'మఅద్'ను తోడ్కొని సిరియా దేశానికి వెళ్ళారు. బుఖ్త నస్సర్ శక్తి క్షీణించిన తరువాత ఆయన మఅద్‌తో కలిసి మక్కా వచ్చారు. అప్పుడు మక్కాలో జుర్హుమ్‌కు చెందిన 'జర్షుమ్ బిన్ జుల్హమా' అనే ఓ వ్యక్తి కలిశాడు. మఅద్ అతని కుమార్తె 'ముఆనా'ను పెళ్ళాడాడు. ఆమె గర్భాన 'నజార్' జన్మించాడు.[7]

---

*3. బైబిల్ పాత నిబంధన-25 : 17.*

*4. ఖల్బ్ జజీర అరబ్ -పేజీ-230, 237.*

*5. ఇబ్నె హష్షామ్-1/111-113, ఇస్మాయీల్ (అ.స.) సంతానంలో కేవలం నాబిత్ కాబా గృహం సంరక్షణ గురించే రాశాడు.*

*6. ఖల్బ్ జజీరతుల్ అరబ్-పేజీ. 230.* *7. రహ్మతుల్ లిల్ ఆలమీన్-2/48.*

https://teluguislam.net



కాలం గడిచిన కొద్దీ జుర్హుమ్ పరిస్థితులు విషమించనారంభించాయి. దారిద్ర్యం అలుముకున్న ఫలితంగా వారు హజ్ యాత్రికులపై విరుచుకుపడి అన్యాయాలు చేయసాగారు. దైవ గృహానికి చెందిన సంపదను కూడా కాజేయ నారంభించారు.[8] ఇటు బనీ అద్నాన్ వారి ఆగడాలను భరించలేక లోలోనే బాధపడుతూ ఉండేవారు. 'బనూ ఖుజాఅ', ముర్రజ్జహ్రాన్‌కు వచ్చినప్పుడు, బనూ అద్నాన్, బనూ జుర్హుమ్ ఎడల కోపోద్రిక్తులైన విషయం గ్రహించాడు. వీరి కోపతాపాల ప్రయోజనం పొందుతూ అద్నానీ తెగ (బనూ బక్ర్ బిన్ అబ్దె మునాఫ్ బిన్ కనానా)ను వెంటబెట్టుకొని బనూ జుర్హుమ్‌కు వ్యతిరేకంగా యుద్ధం ప్రకటించాడు. బనూజుర్హుమ్‌ను మక్కా నుండి గెంటివేసి అధికారం చేజిక్కించుకున్నాడు. ఈ సంఘటన క్రీ.శ. 200 మధ్యకాలం నాటిది.

బనూ జుర్హుమ్ మక్కాను వదిలి వెళ్ళేటప్పుడు 'జమ్‌జమ్' బావిలో అనేక చారిత్రక ఆధారాలను పడవేసి పూడ్చి దాన్ని నామరూపాల్లేకుండా చేశారు. ముహమ్మద్ బిన్ ఇస్హాక్ కథనం ప్రకారం, జుర్హుమ్ తెగకు చెందిన అమ్రూ బిన్ హారిస్ బిన్ మజాజ్[9] దైవగృహం కాబాకు చెందిన రెండు బంగారు లేళ్ళు,[10] కాబా మూలన పొదిగి ఉన్న రాయి - హజ్రె అస్వద్-ను తీసి జమ్‌జమ్ బావిలో పూడ్చేసి తన తెగతో సహా యమన్ వెళ్ళిపోయాడు. మక్కా నుండి వెళ్ళగొట్ట బడడం, అక్కడి పాలన అంతమైపోవడం గురించి బనూ జుర్హుమ్ వారు చాలా బాధపడేవారు. వారు తరచు ఈ గీతాన్ని ఆలపించేవారు.

"హజూన్ నుండి సఫా వరకు తెలిసినవాడెవ్వడూ కనబడడం లేదు. ఏ కథకుడూ మా విషయంలో కథలను వల్లించేవాడుగా కానరావడం లేదు. మేము అచ్చటి పౌరులమే అయినా మా దురదృష్టం, కాలచక్రం మమ్మల్ని పూర్తిగా అక్కడి నుండి పెకిలి వేసింది."[11]

---

*8. ఖల్బ్ జరీరతుల్ అరబ్-పేజీ. 231.*

*9. ఇతను, హజ్రత్ ఇస్మాయీల్ (అ.స) గారి చరిత్రలో చెప్పబడిన మజాజ్ జుర్హుమీ కాదు.*

*10. మస్‌ఊది తన గ్రంథంలో రచించినట్లుగా, పర్షియా రాజులు దైవగృహం కాబా కోసం తరచు ధన సంపద, వజ్రవైఢూర్యాలు కానుకగా పంపిస్తూ ఉండేవారు. సాసాన్ బిన్ బాబక్ బంగారంతో పోత పోసిన రెండు లేళ్ళు, వజ్రాలు, ఖడ్గాలు ఇంకా పెద్ద మొత్తంలో బంగారం పంపించాడు. అమ్రూ వీటన్నిటిని జమ్‌జమ్ బావిలో పడవేశాడు (మురూజుజ్జహబ్ 1/205)*

*11. ఇబ్నె హష్షామ్ 1/114, 115.*

https://teluguislam.net



హజ్రత్ ఇస్మాయీల్ (అ.స.) కాలం క్రీ.పూ. 2000 సంవత్సరాలు. ఈ లెక్కన మక్కాలో జుర్హుమ్ తెగ ఉనికి రెండు వేల ఒక వంద సంవత్సరాలు. వారి పాలన దాదాపు రెండు వేల సంవత్సరాల వరకు సాగింది.

బనూ ఖుజాఅ మక్కాను జయించిన తరువాత బనూ బక్ర్ సహాయం లేకుండానే తమ పాలనను నెలకొల్పారు. అయితే మూడు ప్రముఖమైన, విశిష్ఠమైన హోదాలు మాత్రం ముజ్రీ తెగలకు దక్కాయి.

1. హజ్ యాత్రికులను అరఫాత్ నుండి ముజ్దలిఫా తీసుకొని వెళ్ళడం మరియు యౌమున్నఫర్ - పదమూడు జీహజ్జాకు సంబంధించిన చివరి రోజు- మినా నుండి బయలుదేరే అనుమతినివ్వడం. ఈ గౌరవం ఇల్యాస్ బిన్ ముజిర్ కుటుంబం బనూ గౌస్ బిన్ ముర్రాకు దక్కింది. వీరిని 'సూఫా'లనే వారు. ఈ గౌరవం ఎలాంటిది అంటే పదమూడు జీహజ్జా నాడు, మొదట సూఫాకు చెందిన వ్యక్తి గులకరాళ్ళు విసరనంత వరకు ఏ హాజీ కూడా గులకరాయిని విసరడానికి వీల్లేదు. ఆ తరువాత హాజీలు గులకరాళ్ళను విసిరి మినా నుండి బయలుదేరేవారు. ఈ సమయంలో సూఫాకు చెందినవారు మినా నుండి బయలుదేరే ఏకైక మార్గంలో రెండు వైపులా వరుసకట్టి నిలబడేవారు. వారు ఆ మార్గం నుండి బయలుదేరేంత మట్టుకు ఏ హాజీని కూడా బయటకు పోనిచ్చేవారు కారు. వీరు వెళ్లిపోగానే తక్కిన వారి కోసం మార్గం ఏర్పడేది. సూఫా కుటుంబం అంతమైపోయిన తరువాత ఈ గౌరవం 'బనూ తమీమ్' కుటుంబం బనూ సఅద్ బిన్ జైద్‌ను వరించింది.

2. పదవ జీహజ్జా నాడు ఉదయాన్నే ముజ్దలిఫా నుండి 'మినా' వైపు అఫాజా (బయలుదేరడం) చేసే గౌరవం బనూ ఉద్వాన్‌కు దక్కింది.

3. నిషిద్ధ మాసాలను అటూ ఇటూ మార్చడం. ఈ గౌరవం బనూ కనానాకు చెందిన ఓ శాఖ బనూ తమీమ్ అద్దీకి లభించింది.[12]

మక్కాపై బనూ ఖుజాఅ అధికారం దాదాపు మూడు వందల ఏండ్ల వరకు కొనసాగింది.[13]

అద్నానీ తెగలు మక్కా మరియు హిజాజ్ నుండి బయలుదేరి నజద్, ఇరాఖ్ చుట్టుప్రక్కల మరియు బహ్రైన్ లోనికి వ్యాపించిన కాలమిది. మక్కా

12. ఇబ్నె హిష్షామ్-1/44,119,122. 13. యాకూత్ : మాద్దయె మక్కా.

https://teluguislam.net



చుట్టుపట్ల కొన్ని ఖురైష్ శాఖలు ఉండిపోయాయి. వీరు దేశదిమ్మరులు. వీరు గుంపులు గుంపులుగా ఉంటూ వచ్చేవారు. 'బనూ కనానా'లో వారికి సంబంధించిన కొన్ని భిన్న కుటుంబాలు ఉంటూ ఉండేవి. అయితే మక్కా పరిపాలన మరియు బైతుల్లా (కాబా గృహం) పౌరోహిత్యంలో వారికి ఎలాంటి భాగం లేకుండా ఉండేది. చివరికి ఖుస్సై బిన్ కిలాబ్ పైకి వచ్చాడు.[14]

ఖుస్సై బిన్ కిలాబ్ ఇంకా శిశువుగానే ఉన్నప్పుడు అతని తండ్రి చనిపోయినట్లు చెప్పుకోవడం జరుగుతోంది. ఆ తరువాత అతని తల్లి బనూ ఉజ్రాకు చెందిన వ్యక్తి రబీయా బిన్ హిరామ్‌ను పెళ్ళాడింది. ఈ తెగ సిరియా పరిసరాల్లో నివసిస్తూ ఉండేది. కాబట్టి ఖుస్సై తల్లి కూడా తన కుమారుణ్ణి వెంటబెట్టుకొని అక్కడికి వెళ్ళిపోయింది. ఖుస్సై పెరిగి పెద్దవాడై యవ్వన దశకు చేరుకున్న తరువాత మక్కాకు తిరిగివచ్చాడు. అప్పుడు మక్కాను హులైల్ బిన్ జషియాక జాయీ పాలిస్తూవున్నాడు. ఖుస్సై అతని కుమార్తెను వివాహ మాడదలచి వివాహ సంబంధం కోసం మనిషిని పంపాడు. దానికి హులైల్ సమ్మతించి తన కుమార్తెనిచ్చి పెళ్ళి చేశాడు.[15] ఆ తరువాత హులైల్ మరణించినప్పుడు, మక్కా మరియు కాబా గృహ సంరక్షణకు సంబంధించి ఖురైష్ మరియు 'ఖుజాఅ' నడుమ యుద్ధం జరిగింది. ఫలితంగా మక్కా, కాబా గృహాలపై ఖుస్సై అధికారం ఏర్పడింది.

ఆ యుద్ధానికి కారణం ఏమిటీ? అనే విషయంలో మూడు కథనాలు వినబడతాయి. ఒకదాని ప్రకారం, ఖుస్సై సంతానం బాగా వృద్ధి చెంది ధన సంపదలు పుష్కలంగా పెరిగినప్పుడు ఆ కుటుంబానికి మంచి పలుకుబడి వచ్చింది. ఇటు హులైల్ మరణించగా, బనూ ఖుజాఅ, బనూ బక్రల కంటే కాబా గృహసంరక్షణకు, మక్కా పాలనకు తానే ఎక్కువ హక్కుదారుణ్ణని ఖుస్సై తలచాడు. అదీకాక ఖురైష్‌లు స్వచ్ఛమైన ఇస్మాయీల్ వంశానికి చెందిన అరబ్బులని, తక్కిన ఇస్మాయీలీయులకు నాయకులు కూడా (కాబట్టి నాయకత్వానికి తానే అర్హుడు) అని అనుకొని, ఖురైష్ మరియు బనూ ఖుజాఅ పెద్దలు కొందరితో చర్చించి, బనూ ఖుజాఅ, బనూ బక్రలను మక్కా నుండి ఎందుకు గెంటివేయకూడదు? అని తీర్మానించాడు. వారంతా ఈ అభిప్రాయంతో ఏకీభవించారు.[16]

---

14. ముహాజిరాతె ఖిజ్రీ-1/35, ఇబ్నె హష్షామ్-1/117.

15. ఇబ్నె హష్షామ్-1/117,118.

16. ఇబ్నె హష్షామ్-1/117, 118.

https://teluguislam.net



రెండవ కథనం ప్రకారం - ఖుజాఅ చెప్పినట్లుగా - హులైల్ స్వతహాగా ఖుస్సైకు మరణశాసనం చేస్తూ మక్కా అధికారాన్ని, కాబా గృహ సంరక్షణను చేపట్టమని చెప్పాడు.[17]

మూడవ కథనం ప్రకారం, హులైల్ తన కుమార్తె హుబీకు కాబా గృహ సంరక్షణ బాధ్యతను అప్పగించి, అబూ గబ్షాన్ (ఖుజాయి తెగవాడు)ను ఆమెకు వకీలుగా చేశాడు. కాబట్టి హుబీ సహాయకునిగా అతనే కాబా గృహ తాళపుచెవులు పెట్టుకునేవాడు. హులైల్ మరణించాక ఖుస్సై, అబూ గబ్షాన్ నుండి ఓ తోలు తిత్తి నిండా సారాయి ఇచ్చి కాబా గృహ సంరక్షణ బాధ్యతల్ని కొనుక్కున్నాడు. అయితే ఖుజాఅ ఈ బేరాన్ని సమ్మతించక ఖుస్సైని కాబా గృహ సంరక్షణ నుండి అడ్డుకోజూశారు. దీనికి ఖుస్సై బనూ ఖుజాఅను మక్కా నుండి తరిమివేయడానికి ఖురైష్ మరియు బనూ కనానాను సమావేశ పరిచాడు. వారు ఖుస్సై పిలుపును అందుకోగానే సమావేశమయ్యారు.[18]

మొత్తానికి కారణమేదైనప్పటికి జరిగిన సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి: హులైల్ మరణం తరువాత సూఫా ఇదివరకు అవలంబించిన మార్గాన్నే అవలంబించారు. ఖుస్సై, ఖురైష్ మరియు కనానాకు చెందిన వారిని వెంటబెట్టుకొని, ఉఖ్బా దాపున చేరి ఉన్న వారి దగ్గరకి వచ్చి, "మీకంటే మేమే ఆ గౌరవానికి అర్హులం" అని చెప్పాడు. దానికి సూఫా వారు యుద్ధాన్ని ప్రకటించారు. అయితే ఖుస్సై వారిని ఓడించి ఈ గౌరవాన్ని వారి నుండి లాక్కున్నాడు. ఈ సందర్భంగా ఖుజాఅ, బనూ బక్ర్‌లు ఖుస్సైకి దూరం కాగా అతడు వారితోనూ యుద్ధానికి కాలుదువ్వాడు. ఇంకేముంది! ఉభయుల నడుమ భీకర యుద్ధం ప్రారంభం అయింది. ఉభయ సైన్యాల్లోని అనేకులు హతమయ్యారు. ఆ తరువాత జరిగిన సంధి సంప్రతింపుల్లో బనూ బక్ర్ తెగకు చెందిన ఓ వ్యక్తి యామర్ బిన్ ఔఫ్‌ను తీర్పు చెప్పమని ఎన్నుకోవడం జరిగింది. యామర్ తన తీర్పులో, ఖుజాఅకు బదులు ఖుస్సైయే కాబా సంరక్షణకు, మక్కా అధికారానికి అర్హుడంటూ తీర్పునిచ్చాడు. అదే కాకుండా ఆ తీర్పులో ఖుస్సై ద్వారా జరిగిన రక్తపాతం అంతా వృధాగా పోతుందని, దాన్ని నేను నా కాళ్ళ క్రిందవేసి నలిపేస్తున్నానని చెబుతూ, ఖుజాఅ మరియు బనూ బక్ర్ తెగలు ఎవరినయితే చంపారో దానికి వారు రక్తపరిహారం చెల్లించుకోవాలని, దైవ

17. ఇబ్నె హష్షామ్-1/118.

18. రహ్మతుల్ లిల్ ఆలమీన్-2 /55.

https://teluguislam.net



గృహాన్ని వెంటనే ఖుస్సైకు అప్పగించాలని చెప్పాడు. ఈ తీర్పు వల్ల యామర్ బిరుదు "షద్దాఖ్"[19]గా పడిపోయింది. షద్దాఖ్ అంటే కాళ్ళక్రింద వేసి నలిపేవాడు అని అర్థం.

ఈ తీర్పు ఫలితంగా ఖుస్సై మరియు ఖురైష్‌లకు మక్కాపై పూర్తి అధికారం, నాయకత్వం లభించాయి. ఖుస్సై బైతుల్లాహ్ (దైవగృహం కాబా)కు ధర్మకర్త అయిపోయాడు. ఈ దైవగృహాన్ని సందర్శించడానికి అరేబియా మూరు మూలల ప్రాంతాల నుండి ప్రజలు రావటం ప్రారంభించారు. మక్కాపై ఖుస్సై అధికారానికి సంబంధించిన ఈ సంఘటన క్రీ.శ. 500 మధ్యకాలం నాటిది. అంటే క్రీ.శ. 440వ సంవత్సరం అన్న మాట.[20]

ఖుస్సై మక్కా నియంత్రణ కోసం మక్కా చుట్టుప్రక్కల నివసిస్తున్న ఖురైష్ తెగ వారందరిని పిలిపించి పూర్తి నగరాన్ని వారి మధ్య పంచిపెట్టాడు. ప్రతి కుటుంబం వారు ఉండడానికి స్థలాలను కేటాయించాడు. అయితే నిషిద్ధ మాసాలను వెనకాముందు మార్చేవారైన 'అలె సుఫ్యాన్', 'బనీ ఉద్వాన్' మరియు 'బనూ ముర్రా బిన్ ఔఫ్'ల హోదాలను వారి దగ్గరనే ఉండేటట్లు చూశాడు. దీనికి కారణం, అతని దృష్టిలో ఇది కూడా ధర్మానికి సంబంధించిన విషయమే, ఇందులో మార్పులు చేర్పులు చేయడం సరికాదు అని తలచడమే.[21]

ఖుస్సై చేసిన ఘనకార్యాల్లో, హరమ్ (కాబా గృహం) ఉత్తరాన 'దారున్నద్వా'ను నిర్మించడం (దీని ద్వారం మస్జిద్ వైపునకు ఉండేది). దారున్నద్వా నిజానికి ఖురైష్‌ల పార్లమెంటు అని చెప్పాలి. అక్కడ పెద్ద పెద్ద మరియు ముఖ్యమైన వ్యవహారాల గురించి తీర్పులు జరిగేవి. ఖురైష్‌లు దారున్నద్వాకు రుణపడి ఉన్నారు. కారణం, అది వారి ఏకత్వాన్ని నిలిపి ఉంచింది. ఇచ్చటనే వారి చిక్కు సమస్యలన్నీ సునాయాసంగా పరిష్కరింప బడేవి.[22]

ఖుస్సై కాబా ధర్మకర్తగా ఈ క్రింది గౌరవప్రదమైన మహోన్నత హోదాలను చేబట్టాడు. అవి-

---

*19. ఇబ్నె హష్షామ్-1/123, 124.* *20. ఖల్బ్ జజీరతుల్ అరబ్-పేజీ. 232.*
*21. ఇబ్నె హష్షామ్,-1/124, 125.*
*22. ఇబ్నె హష్షామ్-1/125; ముహాజిరాతె ఖిజ్రీ - 1/36; అఖ్బారుల్ కిరామ్ -పేజి 152.*

https://teluguislam.net



1. **దారున్నద్వా అధ్యక్ష పీఠం-** అక్కడ గొప్ప గొప్ప వ్యవహారాలకు సంబంధించి సలహా సంప్రతింపులు జరిగేవి. అక్కడనే మక్కాకు చెందిన వారు తమ కుమార్తెల వివాహాలు చేసేవారు.

2. **లివా -** అంటే యుద్ధ పతాకం ఖుస్సై తన చేతుల మీదుగా కట్టేవాడు.

3. **హిజాబత్ -** అంటే కాబాగృహ సంరక్షణ- కాబా గృహద్వారం ఖుస్సై మాత్రమే తెరిచేవాడు. అతనే దాని బాగోగులను చూస్తూ తాళపుచెవులను తన వద్దనే ఉంచుకునేవాడు.

4. **సిఖాయా (దాహం తీర్చడం)-**కొన్ని తొట్టెల్లో హాజీల కోసం నీరు నిలువ చేసి అందు ఖర్జూర పండ్లు, కిష్మిష్ వేసి దానిని మధురంగా మార్చేవారు. హాజీలు మక్కా వచ్చినప్పుడు దాన్ని త్రాగేవారు.[23]

5. **రిఫాదా (హాజీల ఆతిథ్యం) -** అంటే హాజీల విందు కోసం భోజనం తయారు చేయడం. దీని కోసం ఖుస్సై, ఖురైష్ తెగ వారు తప్పనిసరిగా తమ ఆదాయం నుండి కొంత చెల్లించాలని నిబంధన పెట్టాడు.

ఇది హజ్ కాలంలో ఖుస్సై వద్ద జమ అయ్యేది. ఖుస్సై ఆ డబ్బుతో హాజీల కోసం భోజనం తయారు చేయించేవాడు. బొత్తిగా డబ్బులేనివారు లేదా దారి బత్తెము లేనివారు ఈ భోజనాన్ని భుజించేవారు.[24]

ఈ హోదాలన్నీ ఖుస్సై వద్దనే ఉండేవి. ఖుస్సై పెద్ద కుమారుడు 'అబ్దుద్దార్'. అయితే, ఇతనికి బదులు అతని రెండవ కుమారుడు 'అబ్దె మునాఫ్', ఖుస్సై జీవిత కాలంలోనే నాయకత్వ లక్షణాలను పొందాడు. అందుకని ఖుస్సై అబ్దుద్దార్‌ను ఉద్దేశించి, వీరు గౌరవప్రతిపత్తుల్లో నీకంటే మెరుగైనప్పటికి నేను నిన్ను అంతటివాణ్ణిగా చేస్తాను అని చెప్పాడు. కాబట్టి ఖుస్సై తన హోదాలన్నీ అబ్దుద్దార్‌కు చెందేటట్లు వీలునామా రాయించాడు. అంటే, దారున్నద్వా అధ్యక్ష పదవి, కాబా గృహ సంరక్షణ, లువా, సిఖాయా మరియు రిఫాదాలన్నిటిని అబ్దుద్దార్‌కు ఇచ్చివేశాడు. ఏ విషయంలోను ఖుస్సై మాటను వ్యతిరేకించడంగాని, అతని ఆదేశాన్ని రద్దు చేయడంగాని లేకపోవడం, పైగా అతని ప్రతి ఆదేశం అతని జీవితంలోను, మరణానంతరం కూడా అనుసరించడం ధర్మంగా తలచబడేది. కాబట్టి ఖుస్సై మరణం తరువాత అతని కుమారులు ఎలాంటి

---

*23. ముహాజిరాతె ఖిజ్రీ-1/36.* *24. ఇబ్నె హష్షామ్-1/130.*

https://teluguislam.net



జగడాలు లేకుండా అతని వీలునామాను జవదాటలేదు. అయితే అతని రెండవ కుమారుడు అబ్దె మునాఫ్ చనిపోయిన తరువాత అతని కుమారులు ఆ హోదాల విషయంలో తమ దాయాదులైన అబ్దుద్దార్ కుమారులతో పేచీకి దిగారు. దీని ఫలితంగా ఖురైష్ రెండు వర్గాలుగా చీలిపోవాల్సివచ్చింది. ఉభయ వర్గాల నడుమ యుద్ధ వాతావరణం నెలకొన్నప్పుడు వారిలో కొందరు సంధికి పిలుపునివ్వడం, ఆ హోదాలను పరస్పరం పంచుకోవడం జరిగింది. పంపకంలో సికాయా, రిఫాదా హోదాలు బనూ అబ్దె మునాఫ్‌కూ, దారున్నద్వా నాయకత్వం, లువా మరియు హిజాబత్ హోదాలు బనూ అబ్దుద్దార్ వాటాకు వచ్చాయి. ఆ తరువాత బనూ అబ్దె మునాఫ్ తమ వాటాకు వచ్చిన హోదాలను పంచుకోవాలని వారు చీటీలు వేయగా అదృష్టం హాషిం బిన్ అబ్దె మునాఫ్‌ను వరించింది. కాబట్టి హాషిం బిన్ అబ్దె మునాఫ్ తన జీవితాంతం సికాయా, రిఫాదాలకు సంబంధించిన సౌకర్యాలను చూస్తూ వచ్చాడు. హాషిం చనిపోయిన తరువాత అతని సోదరుడు ముత్తలిబ్ ఆ హోదాలను తన చేతుల్లోకి తీసుకున్నాడు. కాని ముత్తలిబ్ మరణానంతరం ఆయన సోదరుని కుమారుడు అబ్దుల్ ముత్తలిబ్ బిన్ హాషిం-ఈయనే దైవప్రవక్త ముహమ్మద్ (స)కు తాత- ఈ హోదాలను నిర్వహించారు. ఆయన తరువాత ఆయన సంతానం ఆ వ్యవహారాలను చూస్తూ వచ్చింది. చివరికి ఇస్లాం శకారంభం అయిన తరువాత ఈ హోదాను కలిగి ఉన్న వ్యక్తి హజ్రత్ అబ్బాస్ బిన్ అబ్దుల్ ముత్తలిబ్ గారే.[25]

ఇవే కాకుండా మరికొన్ని హోదాలను ఖురైష్‌లు పరస్పరం పంచు కున్నారు. ఈ హోదాలు, వ్యవస్థలు పకడ్బందీగా సాగడం వలన ఖురైష్‌లు ఓ చిన్న పరిపాలన ఏర్పరచారు- ఇంకా చెప్పాలంటే ఇది ఓ పరిపాలన వ్యవస్థ - ఏర్పరచారా అన్నట్లుగా కనబడేది. ఆ వ్యవస్థకు సంబంధించిన ప్రభుత్వ సంస్థలు, రూపురేఖలు నేటి పార్లమెంటు సభల్లా అలరారేవి. ఆ హోదాల రూపురేఖలు ఈ క్రింది విధంగా ఉండేవి.

1. **ఈసార్** - అంటే భవిష్యత్తు గురించి తెలుసుకోవడానికి విగ్రహాల దగ్గర ఏ బాణాలైతే ఉండేవో వాటి సంరక్షణ. ఈ హోదా 'బనూ జమహ్' వద్ద ఉండేది.

---

25. ఇబ్నె హష్షామ్- 1/129-132, 137,142,178,179.

https://teluguislam.net



2. రెవెన్యూ వ్యవస్థ - విగ్రహాల అనుగ్రహం పొందడానికి ప్రజలు సమర్పించే కానుకలను, బలులను కాపాడడం. ఇదే కాకుండా జగడాలకు, సమస్యలకు తీర్పు చెప్పడం. ఈ పని 'బనూ సహమ్'కు అప్పగించబడింది.
3. షూరా - సలహా సంఘం. ఈ గౌరవం 'బనూ అసద్'కు దక్కింది.
4. అష్నాక్ - అంటే రక్తపరిహారం, జరిమానాలు - ఈ హోదా 'బనూ తైమ్' వద్ద ఉండేది.
5. అఖాబ్ - అంటే జాతీయ పతాకాన్ని పొంది ఉండడం- ఈ హోదా 'బనూ ఉమ్మియా' వాటాకు వచ్చింది.
6. ఖుబా - సైనిక క్యాంపు బాగోగులను చూడడం, గుర్రపు రౌతుల నాయకత్వం- ఇది 'బనూ మగ్జూమ్' తెగ వద్ద ఉండేది.
7. సిఫారత్ - దౌత్యం - ఈ హోదా 'బనూ అద్దీ'ని వరించింది.[26]

## మిగతా అరబ్బు నాయకత్వాలు

వెనుకటి పుటల్లో, ఖహ్తానీ, అద్నానీ తెగల వలస గురించి చెప్పి ఉన్నాం. అరేబియా దేశమంతా వారి నడుమ విభజించబడిన విషయం కూడా చర్చించుకున్నదే. ఆ తరువాత వారి పెత్తనం, నాయకత్వాల రూపురేఖలు ఇలా మారిపోయాయి. ఏ తెగలైతే 'హీరా' నలువైపుల వ్యాపించాయో వారిని 'హీరా' పాలితులుగా, మరే తెగలయితే బాదియతుష్షామ్ (సిరియా)లో స్థిరపడిపోయాయో వారిని గస్సానీ పాలకుల ఆధీనంలో ఉన్నట్లుగా ఖరారు చేయడం జరిగింది. అయితే వారి ఈ పరాధీనత కేవలం నామమాత్రమైనదే. ఈ రెండు ప్రదేశాలను తప్పనిచ్చి మిగిలిన అరేబియా తెగలు సర్వస్వతంత్రులుగా ఉండేవారు.

ఈ తెగల్లో ప్రతీ తెగకు ఓ సర్దారు ఉండడం ఆనవాయితి. ఆ తెగలు తమ సర్దారును తామే ఎన్నుకునేవారు. ప్రతీ తెగ ఓ చిన్న సామ్రాజ్యంగా అలరారేది. రాజకీయ సంరక్షణ తెగల ఐక్యత విషయంలో తెగకు- తెగకు నడుమ ఉండే ఆత్మాభిమానం మరియు వాటి భూభాగాల సంరక్షణ అందుకు కారణం.

తెగల సర్దారుల హోదా వారి జాతిలో ఓ రాజులాంటిది. ప్రతీ తెగ,

26. తారీక్ అర్దుల్ ఖుర్ఆన్-2/104, 105, 106.

https://teluguislam.net



మొత్తానికి, తమ సర్దారు తీర్పును శిరసావహించేది. ఎట్టి పరిస్థితుల్లోను దాన్ని జవదాటేది కాదు. ప్రతి సర్దారుకు ఓ డిక్టేటరు (నియంత)కుండే అధికారాలే ఉండేవి. కొందరు సర్దారుల పరిస్థితి ఎలాగుండేదంటే, వారికి కోపం వచ్చినప్పుడల్లా, ఆ కోపానికి కారణం ఏమిటీ అని అడగకుండానే వేలాది ఖడ్గాలు ఒరల నుండి బయటికి వచ్చేవి. అది అలా ఉండగా, ఒకే కుటుంబానికి చెందిన దాయాదుల్లో నాయకత్వం కోసం సంఘర్షణలు కూడా జరిగేవి. అందుకని ఆ సర్దారులు తమ పాలితుల ఎడల సామరస్యంగా మెలగడం, బాగా డబ్బు ఖర్చు చేయడం, వారికి ఆతిథ్యాలివ్వడం, ధైర్యసాహసాలను ప్రదర్శించడం, ఆత్మాభిమానాన్ని దెబ్బకొట్టే విషయాల్లో తమ తెగ కొమ్ముకాయడంలో ముందడుగుగా ఉండేవారు. ఇలా ప్రవర్తించడం వలన ప్రజల దృష్టిలో, ముఖ్యంగా కవుల దృష్టిలో వారికి బాగా పలుకుబడి రావాలన్నది (ఆ కాలంలో కవులే జాతికి నాలుకగా ఉండేవారు). ఇలా ప్రతీ సర్దారు తన ప్రత్యర్థులకు పై స్థాయిలో ఉండాలని ప్రయత్నించేవాడు.

సర్దారులకు కొన్ని ప్రత్యేకమైన హక్కులుండేవి. ఆ హక్కుల గురించి ఓ కవి ఇలా వివరించాడు.

"మా నడుమ (ఓ సర్దార్) నీకు యుద్ధ ధనంలో నాల్గోవంతు ప్రత్యేకంగా కేటాయించబడిన సంపద ఉంది. నీవు తీర్పు చేసిన ధనం కూడా నీదే. మార్గమధ్యంలో నీ చేత చిక్కింది, పంచగా మిగిలిన ధనమంతా నీదే."

ఆ ధనసంపద లభించే నాలుగు విధాలు ఇవి:

1. **మిర్బా** : యుద్ధంలో లభించిన ధనం (యుద్ధధనం).

2. **సఫ్ఫీ** : పంపకానికి ముందే సర్దారు తన కోసం కేటాయించుకున్న ధనం.

3. **నషీత్** : జాతి దాకా చేరకముందే సర్దారు చేతికి చిక్కిన ధనం.

4. **ఫుజూల్** : పంచగా మిగిలిపోయిన ధనం, యుద్ధంలో పాల్గొని విజయం సాధించిన గాజీల సంఖ్యలో సమంగా పంచబడని ధనం. ఉదాహరణకు పంచగా మిగిలిపోయిన ఒంటెలు, గుర్రాలు వగైరా.

ఈ నాలుగు రకాల ధనసంపదనంతా తెగ సర్దారు తానే ఉంచుకునే హక్కు కలిగి ఉండేవాడు.

https://teluguislam.net



## రాజకీయ పరిస్థితులు

అరేబియా ద్వీపకల్పానికి చెందిన పాలనలు, పాలకుల గురించి తెలుసుకున్న తరువాత వారి రాజకీయ పరిస్థితుల గురించి తెలుసుకోవడం కూడా అవసరమే.

అరేబియాకు పొరుగున ఉన్న మూడు సరిహద్దు ప్రాంతాల రాజకీయ పరిస్థితి, అరాచకం, అస్థిరత మరియు పతనావస్థకు దిగజారిపోయింది. మానవుడు యజమాని మరియు బానిసగా లేదా పాలకుడు మరియు పాలితునిగా రెండు వర్గాల్లో విభజించబడి ఉన్న కాలమది. ప్రయోజనాలన్నీ పాలకుల- ప్రముఖంగా విదేశీ పాలకుల- హస్తగతమై, బరువు భారమంతా బానిసలపైనే మోపబడి ఉండేది. ఇంకా వివరంగా చెప్పాలంటే, ప్రజలు నిజానికి ఓ వ్యవసాయ క్షేత్ర సదృశంగా ఉండి, పాలకులకు డబ్బు, ఆదాయం సమకూర్చేదిగా మారిపోయింది. ప్రభుత్వం ఆ ఆదాయాన్ని తమ భోగాలకు, ఐశ్వర్యాలకు, కామక్రీడలకు, ప్రజలపై అత్యాచారాలకు ఉపయోగిస్తూ ఉండేది. ప్రజల పరిస్థితి చీకట్లో కొట్టుమిట్టాడుతున్నట్లు కనబడేది. ఎటు చూసినా అఘాయిత్యాలు, అక్రమాలు, అత్యాచారాలు ప్రబలిపోయాయి. ప్రజలు వీటికి వ్యతిరేకంగా పల్లెత్తు మాట కూడా మాట్లాడడానికి వీలు లేదు. ప్రభుత్వ పీడనను, అఘాయిత్యాలను, దౌర్జన్యాన్ని సహించడం తప్ప మార్గమేదీ లేకపోయింది. కారణం, ప్రభుత్వం ఓ నియంతగా వ్యవహరించడమే. మానవ హక్కుల ఉనికే లేదు.

ఈ ప్రాంతాల పొరుగున ఉండే తెగలు ఎటూ పాలుపోక, స్వార్థం కోసం, మనోవాంఛల పరిపూర్తి కోసం ఊగులాడుతూ, ఇరాఖ్ పాలకులతో ఓసారి, సిరియా పాలకులతో మరోసారి చేయి కలిపేవారు.

అరేబియా మధ్యభాగంలో నివసించే తెగలు కూడా రాజకీయ అస్థిరతకు లోనై బలహీనంగానే ఉన్నారు. ఎటు చూసినా వర్గవైషమ్యాలు, జాతి కలహాలు, మత విభేదాలు రాజ్యమేలుతుండేవి. ప్రతీ తెగకు చెందిన వారు, తాము న్యాయం కోసం పోరాడుతున్నా, అన్యాయం కోసం పోరాడుతున్నా ఎట్టి పరిస్థితుల్లోనూ తమ సొంత తెగకే వంతపాడేవారు. కాబట్టి ఓ తెగకు సంబంధించిన ఓ కవి ఇలా అంటున్నాడు.

https://teluguislam.net



"నేనైతే 'గజియా' తెగకు చెందినవాడను. అది తప్పుడు త్రోవను అవలంబించినా నేను ఆ మార్గాన్నే ఎన్నుకుంటాను. ఒకవేళ అది సరి అయిన మార్గాన్ని ఎంచుకుంటే నేను కూడా ఆ సక్రమమైన మార్గాన్నే అవలంబిస్తాను."

అరేబియాలో ఆ తెగలకు ఊతమిచ్చేవాడు, వారి కష్టాలను కడతేర్చే వాడు ఏ ఒక్క రాజు లేకుండాపోయాడు.

అయితే హిజాజ్ ప్రభుత్వాన్ని మాత్రం ప్రజలు గౌరవించేవారు. దాన్ని ధార్మిక కేంద్ర నాయకత్వంగా, ధర్మాన్ని పరిరక్షించే ప్రభుత్వంగా తలచేవారు. ఈ ప్రభుత్వం ఓ రకంగా ప్రాపంచిక నాయకత్వం మరియు ధార్మిక నాయకత్వంతో కూడిన కలగూరగంపగా ఉండేది. అరబ్బులపై ధార్మిక నాయకత్వం పేరున ఔన్నత్యం కలిగి ఉండేది. హరమ్ (మక్కా) మరియు మక్కా చుట్టు ప్రక్కల ఆ ప్రభుత్వ చట్టాలే చెల్లేవి. హజ్ యాత్రికుల అవసరాలను తీర్చే వ్యవస్థను ఏర్పర్చింది, ఇబ్రాహీం (అ.స.) ధర్మం ప్రకారం నడిచేటట్లు ప్రజల్ని కట్టడి చేసిందీ ఈ ప్రభుత్వమే. ఈ ప్రభుత్వం వద్ద పార్లమెంటు సంస్థల్లాంటి సంస్థలు, వ్యవస్థలు కూడా ఉండేవి. అయితే ఈ ప్రభుత్వం, మధ్య అరేబియా లోని అరబ్బుల బాధ్యతలను స్వీకరించలేనంత బలహీనమైనది. అబీసీనియా దాడి జరిగినప్పుడు బయటపడింది.

https://teluguislam.net



# అరేబియా మతాలు - ధర్మాలు

అరేబియా సాధారణ ప్రజలంతా హజ్రత్ ఇస్మాయిల్ (అ.స.) పిలుపు, మత ప్రచారం కారణంగా ఇబ్రాహీం (అ.స.) చూపిన మార్గంలోనే నడిచేవారు. కేవలం ఒకే దైవాన్ని ఆరాధించేవారు (ఏకేశ్వరోపాసన). అయితే కాలం గడిచిన కొద్దీ వారు దైవసందేశానికి సంబంధించిన ఓ భాగాన్ని పూర్తిగా మరచిపోయారు. అయినప్పటికీ ఏకేశ్వర భావన, ఇబ్రాహీం (అ.స.) ధర్మానికి సంబంధించిన కొన్ని గుర్తులు మాత్రం 'బనూ ఖుజాఅ సర్దారు' అమ్రూ బిన్ లుహై' పైకి వచ్చేంత వరకు వారి నడుమన ఉండిపోయాయి. అతను పెరిగి పెద్దయినది సత్కార్యాలు, దానధర్మాలు, ధార్మిక ఆచారాలుగల కుటుంబంలో. అతను కూడా పెద్దయిన తరువాత ఈ విషయాల్లో మంచి ప్రోత్సాహం కనబరిచాడు. ప్రజలు అతనంటే ఇష్టపడేవారు. అతన్ని గొప్ప ధార్మిక పండితుడుగా, దైవానికి ఇష్టమైన వారిలో ఒకనిగా తలచి అతనినే అనుసరించనారంభించారు. అమ్రూ బిన్ లుహై సిరియాకు వెళ్ళినప్పుడు అక్కడి ప్రజలు విగ్రహాలను ఆరాధించడం గమనించాడు. ఈ మార్గమే మేలైన, సత్యమైన మార్గమని తలచాడు. కారణం, సిరియా దైవ ప్రవక్తలు, దైవ గ్రంథాల అవతరణకు పుట్టినిల్లు కావడం. కాబట్టి ఇది సవ్యమైన మార్గమని తలపోసి తన వెంట 'హుబల్' అనే విగ్రహాన్ని తెచ్చుకున్నాడు. దాన్ని కాబా గృహంలో ప్రతిష్ఠించి, మక్కా ప్రజలకు అల్లాహ్‌తో పాటు పూజ చేయమని పిలుపునిచ్చాడు. ప్రథమంగా అరేబియాలో 'షిర్క్' (బహుదైవారాధన) ప్రారంభం అయింది ఇక్కడి నుండే. మక్కా ప్రజలు అతని పిలుపుకు స్వాగతం పలికారు. ఆ తరువాత అనతి కాలంలోనే హిజాజ్ ప్రజలంతా, మక్కా ప్రజలు దైవగృహ సంరక్షకులు, హరమ్‌కు చెందిన వారు గనుక వారి అడుగుజాడల్లో నడుచుకోనారంభించారు.[1]

హుబల్ దేవతే కాకుండా, అరేబియా పురాతన దైవవిగ్రహాల్లో 'మనాత్'

---

1. ముఖ్తసర్ సీరతె రసూల్, రచన; షేక్ ముహమ్మద్ బిన్ అబ్దుల్ వహ్హాబ్ నజదీ. పుట.12.

https://teluguislam.net



దేవతా విగ్రహం ఒకటి. ఇది ఎర్ర సముద్రం తీరంలోని 'ఖుదైద్' దాపులో ఉన్న 'ముసల్లల్'[2] అనే చోట ప్రతిష్ఠించబడి ఉండేది. ఆ తరువాత 'తాయెఫ్'లో 'లాత్' పేరుగల దేవతా విగ్రహం కూడా ఉండేది. ఆ తరువాత 'నక్లా' కొండ లోయలో 'ఉజ్జా' పేరుగల దేవతా విగ్రహాన్ని ప్రతిష్ఠించడం జరిగింది. ఈ మూడు దేవతా విగ్రహాలు అరేబియాలోని పెద్ద విగ్రహాలు. ఆ తరువాత హిజాజ్‌లో షిర్క్ బాగా పెరిగిపోవడం వలన దేవతా విగ్రహాలు విరివిగా వెలిశాయి. ఓ 'జిన్' కూడా అమ్రూ బిన్ లుహైకు లోబడి ఉన్నట్లుగా, అతడు నూహ్ (నోవా) (అ.స.)జాతికి చెందిన విగ్రహాలు 'వద్ద్', 'సవా', 'యగూస్', 'యావూఖ్' మరియు 'నస్ర్'లు జిద్దాలో పాతి ఉన్నట్లుగా చెప్పాడని, జిన్ ఆచూకీ మేరకు అమ్రూ బిన్ లుహై జిద్దా వెళ్ళాడని, వాటిని త్రవ్వి తీశాడని, ఆ తరువాత వాటిని 'తిహామా'కు తెచ్చి హజ్ కాలం రాగానే వివిధ తెగలకు ఇచ్చాడని, ఆ తెగలవారు తమ తమ ప్రాంతాల్లో తీసుకువెళ్ళి ప్రతిష్ఠించు కున్నారని ప్రతీతి. ఆ తరువాత ప్రతి తెగలోను, ప్రతి ఇంటిలోను ఓ విగ్రహం వెలిసిపోయింది.

తదుపరి బహుదైవారాధకులు మస్జిదె హరామ్ (కాబా మస్జిద్)ను కూడా విగ్రహాలతో నింపేశారు. మక్కా జయించబడినప్పుడు బైతుల్లా (కాబా) చుట్టు ప్రక్కల మూడు వందల అరవై విగ్రహాలున్నాయి. వాటిని స్వయంగా దైవప్రవక్త (స) తమ చేతుల మీదుగా ధ్వంసం చేశారు. ఆయన (స) ప్రతి విగ్రహాన్ని తన చేతి కర్రతో త్రోసినప్పుడు అది క్రిందపడిపోయేది. ఆ తరువాత ఆయన వాటన్ని టిని మస్జిదె హరామ్ నుండి బయటకు తీసి కాల్చేయమని ఆదేశించారు.[3]

మొత్తానికి బహుదైవారాధన, విగ్రహారాధన అజ్ఞానకాలం నాటి అరబ్బుల ధర్మానికి గొప్ప ప్రతీకగా నిలిచిపోయింది. వారు ఇబ్రాహీం(అ.స.) ధర్మంపైనే నడుస్తున్నామని విర్రవీగేవారు.

అదేకాకుండా అజ్ఞాన కాలపు అరబ్బుల్లో విగ్రహారాధనకు సంబంధిం చిన కొన్ని ప్రత్యేకమైన ఆచార పద్ధతులు, సంప్రదాయాలు కూడా చోటు చేసు కొని ఉండేవి. అవన్నీ అమ్రూ బిన్ లుహై కనుగొన్నవే. వీరు అమ్రూ బిన్

---

2. సహీ బుఖారి-1/222.
3. ముక్తసర్ సీరతుర్రసూల్-రచన: షేఖ్ ముహమ్మద్ బిన్ వహ్హాబ్ (రహ్మాలై) పుట-13,50, 51, 52, 54.

https://teluguislam.net



లుహై ప్రవేశపెట్టిన ఈ ఆచార సంప్రదాయాలను ఇబ్రాహీం (అ.స.) ధర్మం యొక్క భాగమని, ఆ ధర్మంలో ఎలాంటి మార్పు కావని, ఆ ధర్మానికి అనుగుణంగానే తయారు చేసిన బిద్అతె హసనా అని (శుభప్రదమైన కొత్త ఆచారాలని) తలచేవారు. క్రింది పేరాల్లో మేము ఆ అజ్ఞాన కాలం నాటి విగ్రహారాధనకు సంబంధించిన కొన్ని ఆచారాలను సూచిస్తున్నాము.

1. అజ్ఞాన కాలం నాటి బహుదైవారాధకులు విగ్రహాల వద్ద పురోహితులై కూర్చునేవారు. వాటిని శరణు వేడేవారు. తమను కష్టాల నుండి ఆదుకొమ్మని, అభీష్టాలను నెరవేర్చమని కేకలు వేసి మరీ మ్రొక్కుతూ వేడుకునేవారు. ఈ దేవతలు అల్లాహ్‌కు సిఫారసు చేసి తమ అభీష్టాలను నెరవేరుస్తాయని తలచేవారు.

2. విగ్రహాల హజ్ చేసేవారు (సందర్శించేవారు) వాటి చుట్టు ప్రదక్షిణలు చేసేవారు. వారి ముందు మోకరిల్లుతూ సజ్దాలు చేసేవారు.

3. విగ్రహాలకు కానుకలు, బలులు సమర్పించేవారు. బలి పశువులను విగ్రహాలుండే గుళ్ళ వద్దకు తీసుకువెళ్ళి జిబహ్ చేసేవారు. అప్పుడప్పుడు వారి పేరు మీద ఎక్కడైనా జిబహ్ చేయడం కూడా జరిగేది. జిబహ్‌కు సంబంధించిన ఈ రెండు రకాల గురించి అల్లాహ్ తన గ్రంథం దివ్యఖుర్‌ఆన్‌లో ఉటంకిస్తూ,

   وَلَا تَأْكُلُوا مِمَّا لَمْ يُذْكَرِ اسْمُ اللَّهِ عَلَيْهِ

   **"ఏ జంతువులయితే దేవతా విగ్రహాల వద్ద జిబహ్ చేయబడతాయో అవి కూడా హరామ్ (నిషిద్ధం)"** అని (6-121) సూచించాడు.

   అంటే, అల్లాహ్ పేరును ఉచ్చరించకుండా జిబహ్ చేసే జంతువు మాంసం తినకండి అని అర్థం.

4. దేవతా విగ్రహాల సంతుష్టి కోసం బహుదైవారాధకులు తమ స్తోమతనను సరించి ఆహార పదార్థాలు, పంటలు, పశుసంపద నుండి ఓ భాగం కేటాయించి విగ్రహాలకు సమర్పించుకునేవారు. ఈ విషయంలో వారి ఆచారం ఏమిటంటే, వారు అల్లాహ్ కొరకు కూడా తమ పంటల నుండి, పశువుల నుండి ఓ భాగాన్ని ప్రత్యేకించడం; ఆ తరువాత వివిధ కారణాల వల్ల అల్లాహ్‌కు ప్రత్యేకించిన ఆ భాగాన్ని దేవతా విగ్రహాలకు

https://teluguislam.net



చెందేటట్లు చేయడం. అయితే దేవతా విగ్రహాలకు చెందిన భాగాన్ని మాత్రం ఎట్టి పరిస్థితుల్లోను అల్లాహ్‌కు చెందేటట్లు చేసేవారు కాదు. దీని గురించి దివ్యగ్రంథం ఖుర్‌ఆన్‌లో ఇలా ఉంది:

وَجَعَلُوا لِلّٰهِ مِمَّا ذَرَاَ مِنَ الْحَرْثِ وَالْاَنْعَامِ نَصِيْبًا فَقَالُوْا هٰذَا لِلّٰهِ بِزَعْمِهِمْ وَهٰذَا لِشُرَكَآئِنَا ۚ فَمَا كَانَ لِشُرَكَآئِهِمْ فَلَا يَصِلُ اِلَى اللّٰهِ ۚ وَمَا كَانَ لِلّٰهِ فَهُوَ يَصِلُ اِلٰى شُرَكَآئِهِمْ ؕ سَآءَ مَا يَحْكُمُوْنَ

"అల్లాహ్ కొరకు ఈ ప్రజలు స్వయంగా ఆయనే సృష్టించిన పొలాల నుండి, పశువుల నుండి ఒక భాగాన్ని కేటాయించేవారు. ఇది అల్లాహ్ కొరకు, ఇది మేము ప్రతిష్టించిన భాగస్వాముల కొరకు అని స్వయంగా తామే తీర్మానించుకొని అంటారు. వారు నిలబెట్టిన భాగస్వాములకు చెందే భాగం అల్లాహ్‌కు ఎలాగూ చేరదు. కాని అల్లాహ్‌కు చెందేది మాత్రం వారు నిలబెట్టిన భాగస్వాములకు చేరిపోతుంది. ఎలాంటి తప్పుడు నిర్ణయాలు చేస్తారు ఈ ప్రజలు?." (6-137)

5. విగ్రహాల సామీప్యాన్ని పొందటానికి బహుదైవారాధకులు పశువులకు సంబంధించి వివిధ రకాల మ్రొక్కుల్ని మ్రొక్కేవారు. అల్లాహ్ తన గ్రంథంలో ఇలా సెలవిస్తున్నాడు:

وَقَالُوْا هٰذِهٖۤ اَنْعَامٌ وَّحَرْثٌ حِجْرٌ ۖ لَّا يَطْعَمُهَاۤ اِلَّا مَنْ نَّشَآءُ بِزَعْمِهِمْ وَاَنْعَامٌ حُرِّمَتْ ظُهُوْرُهَا وَاَنْعَامٌ لَّا يَذْكُرُوْنَ اسْمَ اللّٰهِ عَلَيْهَا افْتِرَآءً عَلَيْهِ ؕ

"వారిలా అంటారు: ఈ జంతువులు, ఈ పొలాలు నిషేధించబడ్డాయి. మేము తినిపించదలచిన వారే వీటిని తినగలరు. వాస్తవానికి ఈ కట్టుబాటు వారు స్వయంగా కల్పించుకున్నదే. ఇంకా, వారు కొన్ని జంతువులపై స్వారీ చేయడాన్ని, వాటిచే బరువు లాగించడాన్ని నిషేధించారు. మరికొన్ని

https://teluguislam.net



జంతువులపై వారు అల్లాహ్ నామాన్ని ఉచ్చరించరు. ఇవన్నీ వారు అల్లాహ్‌కు అంటగట్టిన అబద్ధాలు." (6-138)

6. ఈ పశువుల్లోనే బహీరా, సాయిబా, వసీలా మరియు హామీ పేర్లు గల జంతువులుండేవి. 'ఇబ్నె ఇస్‌హాక్' కథనం ప్రకారం, బహీరా సాయిబా పెంటి దూడ. సాయిబా అంటే, ఎడతెగకుండా పది ఈతలు పెంటి దూడ లను మాత్రమే ఈనిన ఒంటె. మధ్యలో పోతు దూడను ఈనడా నికి వీల్లేదు. ఇలాంటి ఒంటెను కట్టకుండా స్వేచ్ఛగా వదిలిపెట్టడం జరిగేది. దానిపై స్వారీ చేయడం గాని, దాని వెంట్రుకుల్ని కత్తిరించడం గాని జరగకపోయేది. అతిథి తప్ప దాని పాలను ఎవ్వరూ త్రాగేవారు కాదు. దీని తరువాత ఆ ఒంటె మరో పెంటి దూడను ఈనితే దాని చెవిని చీల్చేవారు. దాన్ని కూడా తల్లి వెంట స్వేచ్ఛగా తిరగడానికి వదిలేసేవారు. దానిపై కూడా స్వారీ చేయడంగాని, వెంట్రుకల్ని కత్తిరించడంగాని జరిగేది కాదు. అతిథి తప్ప దాని పాలు ఎవ్వరూ త్రాగడానికి వీల్లేదు. ఇదే బహీరా.

'వసీలా' అంటే ఎడతెగకుండా అయిదు ఈతలు రెండేసి పెంటి పిల్లలు పెట్టిన మేక (అయిదు ఈతల్లో మొత్తం పది పెంటి పిల్లలన్న మాట). మధ్యలో పోతు పిల్లను ఈనకూడదు. ఈ మేకను 'వసీలా' అనడానికి కారణం, ఆ మేక పెట్టిన పెంటి పిల్లల్ని ఓ మందగా కలపడం. ఆ తరువాత ఆ మేక ఈనిన పిల్లల మాంసం కేవలం పురుషులే తినేవారు. స్త్రీలకు అందులో భాగం ఉండక పోయేది. అయితే చనిపోయి పుట్టిన పిల్లను మాత్రం స్త్రీ పురుషులు కలిసి తినవచ్చు.

జతకట్టడం వలన ఎడతెగకుండా పది పెంటి పిల్లలు పుట్టడానికి కారణమైన పోతు ఒంటెను 'హామీ' అంటారు. మధ్యలో పోతు పిల్ల పుట్టడానికి వీల్లేదు. ఈ ఒంటె స్వారీకి నిషిద్ధం. దాని వెంట్రుకలు కూడా కత్తిరించడానికి వీల్లేదు. దాన్ని ఒంటెల మందలో విత్తనం కోసం వదిలిపెట్టేవారు. అది తప్ప మరే పనికి దాన్ని వినియోగించేవారు కాదు. అజ్ఞాన కాలం నాటి విగ్రహా రాధనకు సంబంధించిన ఆచారాలను ఖండిస్తూ ఖుర్‌ఆన్ గ్రంథంలో అల్లాహ్

https://teluguislam.net



ఇలా సెలవిస్తున్నాడు.

مَا جَعَلَ اللّٰهُ مِنۡۢ بَحِيۡرَةٍ وَّلَا سَآئِبَةٍ وَّلَا وَصِيۡلَةٍ وَّلَا حَامٍ‌ ۙ وَّلٰـكِنَّ الَّذِيۡنَ كَفَرُوۡا يَفۡتَرُوۡنَ عَلَى اللّٰهِ الۡـكَذِبَ‌ ؕ وَاَكۡثَرُهُمۡ لَا يَعۡقِلُوۡنَ

"అల్లాహ్ 'బహీరా'ను గాని, 'సాయిబా'ను గాని, 'వసీలా'ను గాని, 'హామ్'ను గాని ఎంత మాత్రం నిర్ణయించలేదు. అయినా ఈ అవిశ్వాసులు అల్లాహ్‌పై అబద్ధాన్ని మోపుతున్నారు. వారిలో చాలా మంది బుద్ధిలేనివాళ్ళు." (5-103)

మరో చోట - ఇంకా ఇలా అంటారు,

وَقَالُوۡا مَا فِىۡ بُطُوۡنِ هٰذِهِ الۡاَنۡعَامِ خَالِصَةٌ لِّذُكُوۡرِنَا وَمُحَرَّمٌ عَلٰٓى اَزۡوَاجِنَا‌ ۚ وَاِنۡ يَّكُنۡ مَّيۡتَةً فَهُمۡ فِيۡهِ شُرَكَآءُ‌ ؕ

"ఈ జంతువుల గర్భంలో ఉన్నది మా పురుషు లకు ప్రత్యేకం, మా స్త్రీలకు నిషిద్ధం. కాని మరణించినదయితే ఉభయులూ కలసి దాన్ని తినవచ్చు." (6-139)

పైన చెప్పిన పశువులు బహీరా, సాయిబాలకు వేరే భావాలు కూడా ఉన్నాయి.[4] ఇది ఇబ్నె ఇస్హాక్ కథనానికి కొంత విరుద్ధమైనవి.

హజ్రత్ సయీద్ బిన్ ముసయ్యిబ్ (రహ్మాలై) గారి ప్రకారం, ఈ జంతువులు విగ్రహాల కోసం కేటాయించబడ్డాయి.[5] సహీ బుఖారిలోని ఓ ఉల్లేఖనం ప్రకారం, దేవతా విగ్రహాల పేరున జంతువుల్ని మొట్టమొదటగా వదిలే ఆచారం 'అమ్రూ బిన్ లుహై' చేసినదే అని ఉంది.[6]

అరబ్బులు, ఈ విగ్రహాలు వారిని అల్లాహ్‌కు చేరువగా చేస్తాయని, అల్లాహ్ సమక్షంలో తమకు అనుకూలంగా సిఫార్సు చేస్తాయనే నమ్మకంతో ఈ ఆచారాలన్నీ నిర్వహించేవారు. కాబట్టి దివ్యఖుర్ఆన్‌లో బహుదైవారాధకుల మనోగతాన్ని ప్రస్ఫుటం చేస్తూ అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

مَا نَعۡبُدُهُمۡ اِلَّا لِيُقَرِّبُوۡنَاۤ اِلَى اللّٰهِ زُلۡفٰى ؕ

---

4. సీరతె ఇబ్నె హష్షామ్-1/89, 90.
5. సహీ బుఖారి-1/499.
6. సహీబుఖారి - 1/499.

https://teluguislam.net



"వారు మమ్మల్ని అల్లాహ్ వద్దకు చేరుస్తారని మాత్రమే మేము వారిని ఆరాధిస్తున్నాము." (39-3)

وَ يَعْبُدُوْنَ مِنْ دُوْنِ اللّٰهِ مَا لَا يَضُرُّهُمْ وَلَا يَنْفَعُهُمْ وَيَقُوْلُوْنَ هٰٓؤُلَآءِ شُفَعَآؤُنَا عِنْدَ اللّٰهِ ؕ

"ఈ ప్రజలు అల్లాహ్‌ను కాదని తమకు నష్టాన్నిగానీ, లాభాన్నిగానీ కలిగించ లేని వారిని పూజిస్తున్నారు. 'వారు అల్లాహ్ వద్ద మా కొరకు సిఫారసు చేస్తారు' అని అంటారు." (10-18)

అరబ్బు విగ్రహారాధకులు 'అజ్‌లామ్,' అంటే శకునాల కోసం బాణాలను ఉపయోగించేవారు (అజ్‌లామ్, జల్మ్‌కు బహువచనం. జల్మ్ అంటే ఈకలు కట్టబడని బాణం). శకునాలను తెలుసుకోవడానికి ఉపయోగించే బాణాలు మూడు రకాలు. ఒకటి, కేవలం 'అవును లేదా కాదు' అని రాయబడి ఉన్న బాణాలు. ఈ బాణాలు ప్రయాణం మరియు వివాహం లాంటి పనుల కోసం వాడడం జరిగేది. శకునం చూసేటప్పుడు 'అవును' అనే బాణం బయట పడితే అనుకున్న కార్యాన్ని నెరవేర్చేవారు. 'కాదు' అని బయటపడితే ఒక సంవత్సరం వరకు దాని జోలికి పోయేవారు కారు. మరుసటి సంవత్సరం మరలా శకునం చూడడం జరిగేది.

శకునాలు చూసే రెండవ రకం బాణాలపై రక్తశుల్కం, నీరు వగైరాలు రాయబడి ఉండేవి. మూడవ రకం బాణాలపై 'వీరు మీ వారే' లేదా 'మీ వారు కాదు', లేదా 'మీకు సంబంధించినవాడు' లేదా 'మీతో జతకట్టినవాడు' అని వ్రాసి ఉండేది. ఈ బాణాల ఉపయోగం, ఒకరి గురించి వారు తమ సంతతికి చెందినవారా కాదా అని అనుమానం వచ్చినప్పుడు జరిగేది. అలాంటి అవసరం ఏర్పడినప్పుడు ఆ వ్యక్తిని వంద ఒంటెలతో సహా 'హుబల్' దేవత వద్దకు తీసుకొని వెళ్ళేవారు. ఆ ఒంటెల్ని బాణాలు కలిగి ఉన్న పూజారికి సమర్పించగా అతడు ఆ బాణాలన్నింటిని కలిపి త్రిప్పేవాడు. అందుండి ఓ బాణం బయటకు లాగి దానిపై రాసి ఉన్న అక్షరాలను చదివేవాడు. బాణంపై 'మీకు అయినవాడే' అని తేలితే ఆ వ్యక్తి, ఆ తెగలో ఓ గౌరవప్రదమైన వ్యక్తిగా భావించబడేవాడు. ఒకవేళ 'మీవాడు కాదు' అని తేలితే ఆ వ్యక్తి ఆ తెగకు మిత్రునిగా తలచడం జరిగేది.

https://teluguislam.net



'మీకు సంబంధించినవాడు' అని తేలితే ఆ వ్యక్తి ఇటు ఆ తెగకు చెందిన వ్యక్తిగా గాని, అటు దాని మిత్రునిగా గాని తలచడం జరగకపోయేది.[7]

ఇలాంటి మరో ఆచారం బహుదైవారాధకుల్లో ఉండేది. ఇది జూదం, జూదానికి సంబంధించిన అంబులను ఉపయోగించే ఆచారం. ఈ బాణం సూచన మేరకు వారు జూదపు ఒంటెను జిబహ్ చేసి దాని మాంసాన్ని పంచేవారు.[8]

అరేబియా బహుదైవారాధకులు (ముష్రిక్కులు) కాహిన్‌లు, అర్రాఫులు, నుజూమీలపై నమ్మకం కలిగి ఉండేవారు. 'కాహిన్' అంటే ముందు జరుగ బోయే విషయాల గురించి జోస్యం చెప్పేవాడని అర్థం. కొందరు కాహిన్ లయితే, ఓ జిన్ను తమకు ఆధీనుడై ఉన్నాడని, తెలియని విషయాలను వారికి అందిస్తాడని చెప్పేవారు. మరికొందరైతే అగోచర విషయాలను తెలుసుకునే విద్య వారి వద్ద ఉందని వాదించేవారు.

దొంగతనం, దొంగసొత్తు, దొంగిలించబడిన పశువులు మొదలైనవాటి గురించి సోదె అడగడానికి వచ్చిన వారిని, వారి సంభాషణ, ప్రవర్తన లేదా అతని పరిస్థితుల గురించి అంచనావేసి వారికి ఆ ఆచూకీని తెలిపేవారు కొందరు. వారినే అరబ్బులు అర్రాఫ్‌లని అంటారు.

నక్షత్రాలు, గ్రహాల గమనాన్ని లెక్కకట్టి ప్రపంచంలో ముందు ఏమి జరుగబోతుందోనని భవిష్యవాణి చేసే వారిని 'నుజూమి' (జ్యోతిష్యులు) అని పిలిచేవారు.[9] ఈ నుజూమీల మాటలను నమ్మడం అంటే, గ్రహాలు, నక్షత్రాల శక్తిని విశ్వసించడం అన్న మాట. అరేబియా బహుదైవారాధకులు ఫలానా నక్షత్ర బలం వల్ల వర్షం కురిసింది అని విశ్వసించేవారు.[10]

---

7. ముహాజిరాత్ ఖిజ్రీ-1/56; ఇబ్నె హష్షామ్-1/102, 103.
8. జూదం ఆడేవారు ఓ ఒంటెను జిబహ్ చేసి దాన్ని పది లేక ఇరవై ఎనిమిది పోగు లుగా వేసేవారు. ఆ తరువాత బాణాలు తీసి చూసేవారు. ఏ బాణం పైనైతే విజయం గుర్తు ఉన్న వ్యక్తి భాగానికి అది వస్తే అతడు తన వాటాను తీసుకునే వాడు. విజయ చిహ్నం లేని వ్యక్తి ఓడినట్లు లెక్క. అతడు ఆ మాంసాన్ని ఖరీదు కట్టి మరీ తీసుకునేవాడు.
9. మర్క్ ఆతుల్ మఫాతీహ్, షరహ్ మిష్కాతుల్ మసాహితబ్-2/2,3
10. సహీ ముస్లిమ్ : కితాబుల్ ఈమాన్-అధ్యాయం, అవిశ్వాసం-1/95

https://teluguislam.net



అరబ్బు ముష్రిక్కుల్లో శకునాలకు సంబంధించిన సంప్రదాయం కూడా ఉండేది. దాన్ని అరబ్బీలో 'తియరా' అని అంటారు. మంచి శకునంగాని, దుశ్శకునాన్నిగాని తెలుసుకునే విధానం ఒకటుండేది. ఓ పక్షిని లేదా ఓ లేడిని బెదరగొట్టి లేపేవారు. అది కుడి వైపునకు పరిగెత్తితే మంచి శకునంగాను విజయ సూచనగానూ, ఎడమ వైపునకు పరుగిడితే దుశ్శకునంగాను తలచి దానికి అనుగుణంగా తమ పనులను మానుకునేవారు. అలాగే పక్షి అయినా, జంతువైనా వారు వెళ్ళే మార్గానికి అడ్డంగా వెడితే అది కూడా వారి దృష్టిలో దుశ్శకునమే.

ఇవే కాకుండా మరికొన్ని మూఢాచారాలు అరేబియా అరబ్బుల్లో చోటు చేసుకొని ఉండేవి. కుందేలు కాలి చీలమండ ఎముకను వారి ఇంటి ముందు వ్రేళ్ళాడదీసేవారు. వారంలో కొన్ని దినాలను, సంవత్సరంలోని మాసాల్లో కొన్ని మాసాలను, కొన్ని రకాల జంతువుల్ని, కొన్ని ఇండ్లను, కొందరు స్త్రీలను వారు అశుభాలుగా, కలిసిరానివిగా తలచేవారు. అంటువ్యాధులుకాని కొన్ని వ్యాధుల్ని అంటువ్యాధులగా తలచి రోగి వద్దకు వెళ్ళేవారే కాదు. ఆత్మ గుడ్ల గూబ రూపం దాలుస్తుందని నమ్మేవారు. అంటే హతుని ఆత్మ, హంతకునితో పగతీర్చుకోనంత వరకు ఎడారిలో సంచరిస్తూ 'దాహం, దాహం, నా దాహాన్ని తీర్చండని' అరుస్తూ తిరుగుతుందని, పగతీర్చుకుంటే తప్ప దానికి శాంతి లభించదని తలచేవారు.[11]

## ఇబ్రాహీం (అ.స.) గారి ధర్మంలో ఖురైష్‌ల విపరీత పోకడలు

అజ్ఞాన కాలపు అరబ్బు జాతిలో పైన తెలిపిన ఆచారాలపై నమ్మకాలు చోటు చేసుకొని ఉండడమే కాకుండా వారి నడుమ ఇబ్రాహీం (అ.స.) చూపిన మార్గానికి సంబంధించిన కొన్ని ఆచారాలు నమ్మకాలు కూడా ఉంటూ ఉండేవి. వారు పూర్తిగా ఇబ్రాహీం (అ.స.) ధర్మాన్ని వీడలేదు. అందుకని వారు విధిగా దైవగృహాన్ని గౌరవించడం, దాని చుట్టూ తవాఫ్ (ప్రదక్షిణ) చేయడం కూడా చేస్తూ ఉండేవారు. హజ్, ఉమ్రాలు నిర్వహించేవారు. అరఫాత్, ముజ్దలిఫాలో విడిది చేసేవారు. దానికి తోడు 'హదీ' పశువుల (అల్లాహ్ కోసం బలికి కేటాయించే పశువుల) ఖుర్బానీ కూడా చేసేవారు. అయితే ఇబ్రాహీం (అ.స.) ధర్మంలో అనేక బిద్‌అత్‌లను (క్రొత్త ఆచారాలను) చేర్చారు.

---

*11. సహీ బుఖారి 2/851, 857 వివరణతో సహా.*

https://teluguislam.net



ఉదాహరణకు కొన్ని.

వారు ఏర్పరచుకున్న బిద్అత్‌లలో ఒక బిద్అత్ ఏమిటంటే, మేము హజ్రత్ ఇబ్రాహీం (అ.స.) సంతానం, బైతుల్లా సంరక్షకులం, కాబా గృహం మా సొత్తు, ఏ ఒక్కరు మా హోదాకు సాటిరారు, ఇంకొకరి హక్కులు మా హక్కులకు సమానం కావు అని తలచడం - ఈ కారణంగానే వారు తమ సంతతిని 'హుమ్స్' (వీరులు) గా పిలుచుకునేవారు- కాబట్టి మేము 'హరమ్' (మక్కా) సరిహద్దులను దాటి బయటికి వెళ్ళడం మా హోదాకు తగినది కాదు అంటూ హజ్ కాలంలో 'అరఫాత్' మైదానానికి వెళ్ళేవారు కాదు. అక్కడ 'ఇఫాజా' (విడిది) చేసేవారు కాదు. పైగా ముజ్దలిఫాలోనే ఇఫాజా చేసేవారు. అల్లాహ్ ఈ బిద్అత్‌ను సవరిస్తూ ఖుర్‌ఆన్‌లో ఇలా సెలవిచ్చాడు.

ثُمَّ أَفِيضُوا مِنْ حَيْثُ أَفَاضَ النَّاسُ

"మీరున్నూ, అందరు ఇఫాజా చేసే స్థలం నుండే ఇఫాజా చేయండి."[12]

(2-119)

వీరి మరో బిద్అత్ ఏమిటంటే, హుమ్స్ (అంటే ఖురైష్ వంశం వారు) ఇహ్రామ్ వస్త్రధారణ స్థితిలో జున్ను, నెయ్యి తయారుచేయడం సరికాదని, నీడ కోసం తోలు గుడారాల్లో మాత్రమే ఉండాలని, వెంట్రుకలతో తయారుచేసిన గొంగళి గుడారాలు నిషిద్ధమని తలచడం.[13]

కల్పించుకున్న మరో ఆచారం.

హజ్, ఉమ్రా కోసం హరమ్ (మక్కా) వెలుపలి నుండి వచ్చే యాత్రికులు తెచ్చుకున్న ఆహార పదార్థాలను వీరు తినడం సరికాదని తలచడం.[14]

హరమ్ వెలుపల నుండి హజ్, ఉమ్రా యాత్రికులు హరమ్‌లోనికి ప్రవేశించిన తరువాత మొదటి 'తవాఫ్' (ప్రదక్షిణ) హుమ్స్ ఇచ్చిన వస్త్రాలు కట్టుకునే చేయాలని ఆదేశించడం మరో బిద్అత్. ఆ వస్త్రాలు లభ్యం కాకపోతే పురుషులు నగ్నంగానే తవాఫ్ చేసేవారు. స్త్రీలు తాము ధరించిన వస్త్రాలన్నిటిని విప్పేసి కేవలం ఓ చిన్న సైజు కలిగిన శరీరం కనబడే చొక్కాను ధరించి కాబా గృహ ప్రదక్షిణ చేసేవారు. ప్రదక్షిణ చేస్తూ ఈ క్రింది పద్యపాదాలను వల్లించేవారు.

---

12. ఇబ్నె హష్షామ్-1/199, సహీబుఖారి-1/226
13. ఇబ్నె హష్షామ్-1/202.
14. ఇబ్నె హష్షామ్-1/202.

https://teluguislam.net



"నేడు మర్మాంగాలు కొంచెమో లేదా పూర్తిగానో బయటపడితే నేను దాన్ని చూడడం ధర్మసమ్మతంగా తలచను" అని.

అల్లాహ్ ఈ అర్థంలేని పనుల్ని ఖండిస్తూ వారిని ఇలా హెచ్చరించాడు.

يَٰبَنِيٓ ءَادَمَ خُذُواْ زِينَتَكُمۡ عِندَ كُلِّ مَسۡجِدٖ

**"ఓ ఆదమ్ సంతానమా! ప్రతి ఆరాధనా సమయంలో మీ వస్త్రాలంకరణ పట్ల శ్రద్ధ చూపండి "** (7-31)

మొత్తానికి స్త్రీగాని, పురుషుడుగాని, ఎవరైనా గౌరవంగా ఉండాలనే తలంపుతో, హరమ్ వెలుపలి నుండి తెచ్చిన వస్త్రాలను ధరించి తవాఫ్ చేస్తే, తవాఫ్ అయిన తరువాత ఆ వస్త్రాలను బయట పారేసేవాడు. వాటితో తిరిగి తానుగాని, ఇతరులుగాని ఎవ్వరూ ప్రయోజనం పొందేవారు కాదు.[15]

ఖురైషులు కల్పించుకున్న బిద్అత్‌లలో, ఇహ్రామ్ కట్టుకొని ఇంట్లో ప్రవేశ ద్వారం గుండా లోనికి ప్రవేశించకుండా ఇంటి వెనుక భాగంలో పెద్ద రంధ్రం చేసి అందులో నుంచి లోనికి ప్రవేశించడం, ఆ నిర్వాకాన్ని వారు సత్కార్యంగా భావించడం మరొకటి. దివ్య ఖుర్ఆన్ ఈ ఆచారాన్ని కూడా నిషేధించింది. (2-189)

ఈ ధర్మమే - అంటే బహుదైవారాధన, షిర్క్, మూఢనమ్మకాలు, అర్థం లేని పనుల ధర్మం - అరేబియా ప్రజల్లో సర్వసాధారణమైపోయిన ధర్మం.

ఇదేకాకుండా అరేబియా ద్వీపకల్పం చుట్టూ గల ఇతర ప్రాంతాల్లోని యూదు మతం, క్రైస్తవ మతం, అగ్ని ఆరాధకులు, సాబీ మతం కూడా ప్రవేశించే అవకాశాలు కలిగి ఉండేవి. కాబట్టి వాటి చారిత్రక రూపం టూకీగా ఇక్కడ చెప్పుకుందాం.

అరేబియా ద్వీపంలో యూదుల శకాలు రెండు గడిచాయి. వీటిలో మొదటి శకం, పాలస్తీనాలో 'బాబిలోనియా' మరియు 'అషూర్' సామ్రాజ్యాల విజయం ఫలితంగా యూదులు వలస వెళ్ళడానికి సంబంధించింది. ఆ పరిపాలన దమనకాండ, రాజు 'బఖ్త్ నసర్' యూదు బస్తీలను సర్వనాశనం చేయడం, వారి 'హైకల్' (యూదుల ప్రార్థనా మందిరం) విధ్వంసం, యూదు

15. ఇబ్నె హిషామ్-1/202, 203; సహీహ్‌బుఖారి-1/226.

https://teluguislam.net



లను పెద్ద సంఖ్యలో బాబిలోనియాకు తరిమివేయడం వగైరాల ఫలితంగా యూదులు పాలస్తీనాను వదలి హిజాజ్ ఉత్తర దిశనగల చుట్టుపట్ల ప్రాంతాలకు వచ్చి స్థిరపడడానికి సంబంధించింది.[16]

రెండవ శకం, రోమ్‌కు చెందిన 'టైటస్' నాయకత్వంలో క్రీ.శ.70వ సంవత్సరంలో రోమనులు పాలస్తీనాను వశపర్చుకున్నప్పుడు యూదులపై రోమనులు చేసిన ఆగడాలు వారి హైకల్‌ను నాశనం చేసిన ఫలితంగా అనేక యూదు తెగలు హిజాజ్‌కు కాందిశీకులుగా పారిపోయి రావడం. వీరు యస్రిబ్, ఖైబర్, తైమాలో వచ్చి స్థిరపడి తమ జనవాసాలను నిర్మించుకోవడమే కాక, కోటను, దుర్గాలను నిర్మించుకున్నారు. ఈ వలస వచ్చిన యూదు మతస్తుల ద్వారా అరేబియా ప్రజల్లోను కొంత వరకు యూదు మతం చోటు చేసుకుంది. ఇస్లాం ఆవిర్భావానికి పూర్వం, ఇస్లామ్ ప్రారంభకాలంలోను రాజకీయ ఒడిదుడుకుల్లోను దాని ప్రభావం ఏర్పడటమే. ఇస్లాం ఆవిర్భావం నాటి యూదు తెగల్లో ఖైబర్, నజీర్, ముస్తలక్, ఖురైజా మరియు ఖైనుఖా ప్రముఖమైనవి. వఫా ఉల్ వఫా అనే గ్రంథకర్త సమ్‌హూది ఆ గ్రంథం పుట 116లో ఈ యూదు తెగల సంఖ్య ఇరవైకంటే అధికమని రాశాడు.[17]

యూదు మతానికి యమన్‌లోనూ వికాసం లభించింది. అక్కడ అది వృద్ధినొందడానికి కారణం 'తబాన్ అస్‌అద్ అబూ కరబ్' అనే వ్యక్తి. ఇతను యుద్ధం చేస్తూ యస్రిబ్ చేరాడు. అక్కడనే యూదు మతాన్ని స్వీకరించాడు. బనూ ఖురైజాకు చెందిన ఇద్దరు యూదు పండితుల్ని తమ వెంట తోడుకొని యమన్ దేశానికి వచ్చాడు. వారి ద్వారా యమన్‌లో యూదమతం వ్యాప్తి చెందింది. అబూ కరబ్ అనంతరం అతని కుమారుడు 'యూసుఫ్ జూనువాస్' యమన్‌కు రాజయ్యాడు. అతను యూదు మతం పిచ్చిలో నజ్రాన్‌కు చెందిన క్రైస్తవులపై దాడి చేశాడు. వారిని యూదు మతం స్వీకరించడానికి ఒత్తిడి చేయగా వారు దాన్ని నిరాకరించారు. అందుకు జూనువాస్ ఓ పెద్ద కందకం త్రవ్వించి అందులో అగ్నిని రాజేశాడు. ఆ అగ్నిగుండంలో స్త్రీ, బాల, వృద్ధులు అనే విచక్షణ లేకుండా వారందరిని పడవేసి కాల్చి చంపాడు. చనిపోయిన వారి సంఖ్య ఇరవై, నలభై వేల నడుమ ఉంటుంది అని చెప్పుకోవడం జరుగు

---

16. ఖల్బ్ జజీరతుల్ అరబ్-పుట. 251.
17. ఖల్బ్ జజీరతుల్ అరబ్-పుట. 251.

https://teluguislam.net



తుంది. ఇది క్రీ.శ. అక్టోబరు, 532వ సంవత్సరపు సంఘటన. దివ్య ఖుర్ఆన్ లోని బురూజ్ సూరాలో దీని ప్రస్తావన ఉంది.[18]

ఇక క్రైస్తవం విషయానికొస్తే, అరేబియాలో వారి ప్రవేశం అబీసీనియా మరియు రోమనుల ఆక్రమణ ద్వారా జరిగింది. యమన్‌ను అబీసీనియనులు క్రీ.శ. 340లో ఆక్రమించుకున్న విషయం మనం ఇదివరకే చర్చించుకున్నాం. ఇది మొదటి ఆక్రమణ. ఇది క్రీ.శ. 378 వరకు కొనసాగింది. ఈ మధ్య కాలంలో యమన్ దేశంలో క్రైస్తవ మిషనరీలు పని చేశాయి. దాదాపు అదే కాలంలో ఓ క్రైస్తవ సన్యాసి 'ఫీమూన్' నజ్రాన్‌కు వచ్చాడు. అక్కడి ప్రజల్లో క్రైస్తవ మత ప్రచారం చేశాడు. ఆ సన్యాసి మహత్మ్యాలను, ఆ మతం ఔన్నత్యాన్ని చాటే కొన్ని సూచనలు చూసి నజ్రాన్‌వాసులు క్రైస్తవులుగా మారి పోయారు.[19]

ఆ తరువాత జూనువాస్ చర్యకు ప్రతిచర్యగా అబీసీనియనులు తిరిగి యమన్‌ను వశపర్చుకోవడం జరిగింది. 'అబ్రహా'యమన్ పాలనాపగ్గాలను తన చేతిలో తీసుకొని ఎంతో ఉత్సాహంతో పెద్ద ఎత్తున క్రైస్తవాన్ని విస్తరింపజేసే ప్రయత్నం చేశాడు. ఈ ఉన్మాదంలోనే అతడు యమన్‌లోనే ఓ కాబా గృహాన్ని నిర్మించి అరబ్బు జాతీయులందరిని (మక్కా దైవగృహాన్ని విడిచి) తాను నిర్మిం చిన కాబా హజ్ చేయించడానికి ప్రయత్నం చేశాడు. మక్కాలోని కాబాను ధ్వంసం చేసే ప్రయత్నం చేయగా, అల్లాహ్ అతని ఈ దుస్సాహసానికి తగిన శిక్ష విధించాడు. ఇది అందరికి ఓ గుణపాఠంగా మిగిలిపోయింది.

మరో ప్రక్క రోమను సామ్రాజ్యం పొరుగున ఉన్న కారణంగా ఆలె గస్సాన్, బనూ తగ్లబ్ మరియు బనూ తై వగైరా అరబ్బు తెగల్లో క్రైస్తవం వ్యాపించింది. సరికదా, హీరాకు చెందిన కొందరు అరబ్బు రాజులు సయితం క్రైస్తవ మతాన్ని స్వీకరించారు.

మజూసి (అగ్ని ఆరాధక) మతం. అది చాలా మట్టుకు పర్షియా పొరుగున అరబ్బుల్లో వ్యాప్తి చెందింది. ఉదాహరణకు, అరేబియాలోని ఇరాఖ్ ప్రాంతం, బహ్రైన్ (అల్ అహ్సా), హిజ్ర్ మరియు అరేబియా అఖాత తీరప్రాంతాలు.

---

*18. ఇబ్నె హష్షామ్-1/20, 21, 22, 27,31,35,36. అదే కాకుండా బురూజ్ సూరా వ్యాఖ్యానం గురించి ఖుర్ఆన్ వ్యాఖ్యాన గ్రంథాలను చూడవచ్చు.*

*19. ఇబ్నె హష్షామ్-1/31-34.*

https://teluguislam.net



ఇవే కాకుండా యమన్‌పై పర్షియన్ అధికార సమయాన అక్కడ కూడా కొంత మంది ఈ మతాన్ని స్వీకరించడం జరిగింది.

ఇక మిగిలింది 'సాబీ' మతం. ఇరాఖ్ వగైరాల్లో జరిగిన పురాతన శిథిలాల త్రవ్వ కాల్లో బయల్పడిన శిలాశాసనాల ద్వారా ఇది హజ్రత్ ఇబ్రాహీం (అ.స.) కు చెందిన కల్దాని జాతి మతం అని తెలిసింది. పురాతన కాలంలో సిరియా, యమన్‌వారనేకులు ఈ మతానుయాయులే. అయితే యూదు మతం, ఆ తరువాత క్రైస్తవ వికాసం ఊపందుకున్నప్పుడు ఈ మత పునాదులే కదిలిపోయి నామరూపాల్లేకుండాపోయింది. అయినప్పటికి, మజూసీ మతంతో కలగా పులగమై లేదా వారి పొరుగున్నే ఇరాఖ్ మరియు అరేబియా అఖాత తీరంలోను ఈ మతానుయాయులు కొందరు మిగిలి ఉండేవారు.[20]

## ధార్మిక పరిస్థితి

అరేబియా ద్వీపంపై ఇస్లామ్ కిరణాలు ప్రసరించినప్పుడు అక్కడ మనుచున్న మతాలు ధర్మాలు ఇవే. అయితే ఈ మతాలన్నీ చీలికపేలికలై ఉండేవి. ఇబ్రాహీం (అ.స.) ధర్మాన్నే అనుసరిస్తున్నాం అంటున్న ముష్రిక్‌లు (బహుదైవారాధకులు) సయితం ఆయన బోధనలకు ఆమడ దూరంలోనే ఉన్నారు. ఇబ్రాహీం (అ.స.) ఏ నైతికతలను బోధించారో అవి ఆ ముష్రిక్‌లలో నామ మాత్రానికైనా కానరాకపోయేవి. పాపపంకిలంలోపడి, ఓ సుదీర్ఘకాలం గడిచి పోయినందున వారిలోనూ విగ్రహారాధనకు సంబంధించిన ఆచారాలు సంప్రదాయాలు చోటుచేసుకున్నాయి. ఇవి కూడా ధార్మిక పుణ్యకార్యాలుగానే భావించేవారు. ఈ ఆచారసంప్రదాయాలు వారి రాజకీయ, ధార్మిక జీతవింపై గొప్ప ప్రభావం కలిగి ఉండేవి.

యూదు మత పరిస్థితి కేవలం ప్రదర్శనాబుద్ధి, పెత్తనం చెలాయించడం మట్టుకే మిగిలిపోయింది. యూదు మత గురువులు అల్లాహ్‌కు బదులు తామే ప్రభువులై కూర్చున్నారు. ప్రజలపై తమ ఇష్టాన్ని రుద్దేవారు. ప్రజల మనస్సుల్లోని మాటలను తెలిసినట్లుగా నటిస్తూ, వారి పెదాల నుండి బయటకు వచ్చే ప్రతీ మాటను పరీక్షించేవారు. సంపద, రాజ్యం ఎలా సొంతం చేసుకోవాలన్న

20. తారీఖ్ అర్జుల్ ఖుర్‌అన్-2/193 - 208.

https://teluguislam.net



విషయంపైనే వారి దృష్టి కేంద్రీకరించబడి ఉండేది. వారి ఈ ప్రవర్తన మూలంగా యూదు ధర్మం ఎంత నాశనమైనా సరే, అవిశ్వాసం నాస్తికత్వం ఎంత ప్రబలిపోయినా సరే, ఆ మతానుయాయులకు దైవం ఇచ్చిన ఆదేశాలు, బోధనలు ఎంత దెబ్బతిన్నా సరే.

క్రైస్తవం అనుకోని విధంగా ఓ విగ్రహారాధనగా మారిపోయింది. వారు అల్లాహ్‌ను మరియు మానవుణ్ణి అద్భుతంగా మిశ్రమం చేసేశారు. ఏ అరబ్బులయితే ఈ మతాన్ని స్వీకరించారో వారిపై ఈ మత ప్రభావం ఏ మాత్రం లేకుండా ఉండేది. కారణం, ఈ మత బోధనలు వారికి ప్రియమైన స్వదేశ జీవితానికి సరిపోకపోవడమే. వారు తమ జీవన సరళిని మానుకోకపోవడమే.

తక్కిన అరేబియా మతాలను అవలంబించేవారి పరిస్థితి ముష్రిక్‌లకు భిన్నమైనదేమీ కాదు. వారి ఊహలు, వారి నమ్మకాలు, వారి ఆచార సంప్రదాయాలల్లో అవినాభావ సంబంధం ఉండడమే దానికి కారణం.

https://teluguislam.net



# అజ్ఞాన కాలంనాటి అరబ్బుల సామాజిక తీరుతెన్నులు

ఆనాటి అరేబియా ద్వీపం యొక్క రాజకీయ, ధార్మిక పరిస్థితులను చర్చించుకున్న తరువాత ఇప్పుడు అక్కడి సామాజిక, ఆర్థిక మరియు నైతిక పరిస్థితులు ఎలా ఉండేవో క్లుప్తంగా తెలుసుకుందాం.

## సామాజిక పరిస్థితులు

అరేబియా జనసంఖ్య వివిధ వర్గాల కలగాపులగం. ప్రతి వర్గం పరిస్థితి, ఇంకో వర్గం పరిస్థితి కంటే భిన్నంగా ఉండేది. ఉన్నత వర్గంలోని స్త్రీ పురుషుల నడుమగల సంబంధ బాంధవ్యాలు చెప్పుకోదగినంత ఆధునికంగా ఉండేవి. స్త్రీకి ఆ సమాజంలో చాలా మట్టుకు స్వాతంత్ర్యం ఉండేది. ఆమె సలహాను పాటించడం జరిగేది. ఒక్కోసారి ఆమె సంరక్షణ, గౌరవం విషయంలో యుద్ధాలు కూడా జరిగేవి. అరబ్బులకు తమ శౌర్యప్రతాపాలను చాటుకోవడం అంటే మహా ఇష్టం. దీనికోసం ఓ అరబ్బు వ్యక్తి తన కీర్తిని చాటుతూ స్త్రీనే సంబోధించే వాడు. అప్పుడప్పుడు స్త్రీ అనుకుంటే తెగలన్నిటిని సంధి కోసం ఏకత్రం చేయగలిగేది. కావాలంటే తన ఒక్క సైగపై యుద్ధ జ్వాలలు రగిల్చి రక్తపాతం జరిగేటట్లు కూడా ప్రవర్తించేది. ఏది ఏమైనప్పటికీ, పురుషుడే కుటుంబానికి పెద్దగా తలచబడేవాడు. అతని మాటే తీర్పు. ఈ వర్గంలో స్త్రీ పురుషుల సంబంధం నికాహ్ (వివాహం) ద్వారా ఏర్పడేది. ఈ నికాహ్‌ను స్త్రీ సంరక్షకులు తమ చేతుల మీదనే జరిపేవారు. సంరక్షకుడు లేకుండా ఏ స్త్రీ అయినా తాను సొంతంగా నికాహ్ చేసుకోవడానికి వీల్లేదు.

ఓ వైపు ఉన్నత తరగతి పరిస్థితి ఇలా ఉంటే, మరో వైపు ఇతర తరగతుల్లో స్త్రీ పురుషుల విచ్చలవిడి కలయికకు సంబంధించిన అనేక పద్ధతులు కూడా ఉండేవి. ఈ కలివిడితనానికి అశ్లీలం, వ్యభిచారం తప్ప మరో పేరు పెట్టడానికి వీల్లేదు. హజ్రత్ ఆయిషా (ర.అ.) కథనం ప్రకారం, అజ్ఞాన

https://teluguislam.net



కాలంలోని అరబ్బుల్లో నికాహ్ (వివాహం)కు సంబంధించిన రకాలు నాలుగు. ఒకటి, నేడు సాధారణంగా అమలులో ఉన్న ఆచారం. ఇది, ఓ వ్యక్తి మరో వ్యక్తికి అతని సంరక్షణలో ఉన్న అమ్మాయిని వివాహం చేసుకుంటానని కబురు పంపడం. అతని ఈ సంబంధం స్వీకరించబడినప్పుడు ఆ వ్యక్తి మహర్ (స్త్రీ ధనం) చెల్లించి ఆ అమ్మాయిని పెళ్ళాడేవాడు. రెండవ రకం వివాహం ఎలా జరిగేదంటే, రుతుస్రావం నుండి పరిశుద్ధత పొందిన స్త్రీని, ఆమె భర్త ఫలానా వ్యక్తి దగ్గరకు పంపిస్తూ, ఈమె మర్మాంగాన్ని పొందమని (అంటే ఈమెతో వ్యభిచరించమని) చెప్పి పంపేవాడు. భర్త మాత్రం ఆ వ్యక్తి ద్వారా ఆమె గర్భం దాల్చింది అని తెలిసేటంత మట్టుకు ఆమెకు దూరంగా ఉండేవాడు. నెలలు నిండిన తరువాత భర్త అనుకుంటే ఆమెతో సంభోగించేవాడు. ఇలా చేయ డానికి కారణం పుట్టబోయే బిడ్డ యోగ్యుడుగా ఉండాలన్నదే. ఈ రకం నికాహ్ 'నికాహె ఇస్తైబ్‌జా'గా పిలువబడేది (దీన్నే భారత దేశంలో నియోగ్ అంటారు). నికాహ్‌కు సంబంధించిన మూడవ రకం, పది మంది పురుషులకు తక్కువ సంఖ్యగల ఓ సమూహం ఓ చోట చేరేది. అందరూ ఒకరి తరువాత మరొకరు ఆ స్త్రీతో సంభోగించేవారు. ఆ స్త్రీ గర్భవతి అయి శిశువు జన్మించగా ప్రసవం అయిన కొన్ని రోజుల తరువాత అందరినీ పిలువనంపేది. అందరూ తప్పని సరిగా అక్కడ చేరాలన్న నిబంధన ఉన్నందున వారంతా ఆమె దగ్గర చెప్పిన సమయానికి వచ్చి చేరేవారు. ఆ తరువాత ఆమె వారితో, జరిగిన విషయం మీకందరికి తెలిసినదే. నా గర్భం నుండి జన్మించిన ఈ బిడ్డ మీలోని ఓ ఫలానా వ్యక్తి బిడ్డ అని వారిలోని ఓ వ్యక్తి పేరు చెప్పేది. ఆ బిడ్డ అతని సంతానంగా అందరూ గుర్తించేవారు.

నాలుగవ రకం వివాహం (నికాహ్)లో చాలా మంది కూడి ఒకే స్త్రీని సంభోగించేవారు. ఆమె తన వద్దకు వచ్చిన ఏ పురుషుణ్ణీ కాదనకపోయేది. ఇలాంటి స్త్రీలు కులటలు. ఈ రకం స్త్రీలు తమ ఇంటి ముందు, "ఇది ఫలానా వ్యభిచారిణి ఇల్లు, ఎలాంటి సంకోచం లేకుండా ఎవరైనా రావచ్చు" అని తెలియడానికి జెండాలు కట్టి ఉంచేవారు. ఇలాంటి స్త్రీ గర్భందాల్చి బిడ్డకు జన్మనిస్తే ఆమెతో వ్యభిచరించిన వారంతా ఆమె దగ్గరకు వచ్చి చేరేవారు. అప్పుడు ఓ ముఖసాముద్రికుణ్ణి (Physiognomist- ముఖ లక్షణములను బట్టి తండ్రి ఎవరో నిర్ణయించేవాడు) పిలిపించేవారు. అతను తన అంచనా ప్రకారం

https://teluguislam.net



ఆ బిడ్డను అందులోని ఓ వ్యక్తికి అంటగట్టేవాడు. ఆ తరువాత ఆ బిడ్డ అతని బిడ్డగానే చెలామణి అయ్యేది. అతడు ఆ తీర్పును తప్పకుండా శిరసావహించ వలసిందే. అల్లాహ్, ముహమ్మద్ (స)ను ప్రభవింపజేసిన తరువాత అజ్ఞాన కాలంనాటి ఈ రకం నికాహ్‌లన్నీ రద్దు చేయబడ్డాయి. కేవలం నేడు ఆచరణలో ఉన్న ఒక్క నికాహ్ మాత్రమే మిగిలి ఉంది.[1]

అరేబియాలో స్త్రీ పురుషుల సంబంధాలకు చెందిన రకాలు కొన్ని ఖడ్గం, బరిశె మొనల నీడన ఉనికిలోనికి వచ్చేవి. అంటే తెగల పోరాటాల సందర్భంలో విజయం పొందిన తెగ, ఓడిపోయిన తెగల స్త్రీలను ఖైదు చేసి తన భార్యలుగా చేసుకోవడం అన్నమాట. అయితే, అలాంటి స్త్రీలకు జన్మించిన సంతానం జీవితాంతం దాన్ని అవమానంగానే భావించేది.

అజ్ఞాన కాలంలో ఎలాంటి పరిమితి లేకుండా అనేక భార్యలను కలిగి ఉండడం పరిపాటి. స్వయాన ఒకే తల్లి గర్భంలో జన్మించిన అక్కచెల్లెళ్ళను సయితం భార్యగా చేసుకోవడంలో ఆనాడు తప్పులేదు. తండ్రి విడాకులివ్వగా లేదా మరణించగా కుమారుడు తన మారు తల్లిని నికాహ్ చేసుకునేవాడు. తలాక్ (విడాకులు)ఇచ్చే అధికారం కేవలం పురుషులదే. దానికి ఓ హద్దూపద్దూ అనేది లేకుండా ఉండేది.[2]

వ్యభిచారం అన్నిరకాల వర్గాల్లోను సర్వసామాన్యమై తారాస్థాయికి చేరుకుంది. ఏలాంటి వ్యక్తికిగాని, వర్గానికిగాని ఈ విషయంలో మినహా యింపే లేదు. అయితే కొందరు స్త్రీ పురుషుల ఔన్నత్య భావన వారిని ఈ పాపపంకిలంలో పడకుండా అడ్డుకునేది. అదేకాదు, స్వతంత్ర స్త్రీలు, బానిస స్త్రీలకంటే మెరుగ్గా ఉండేవారు. వ్యభిచారానికి అసలు మూలం కేవలం బానిస స్త్రీలే. అజ్ఞాన కాలపు అరబ్బు జాతి అధిక సంఖ్య ఈ పాపంలో పడినందుకు సిగ్గుపడేదే కాదు. కాబట్టి 'సునన్ అబూ దావూద్' వగైరా హదీసు గ్రంథాల్లోని కథనాల ప్రకారం, ఓ వ్యక్తి నిలబడి, "ఓ దైవప్రవక్తా (స)! ఫలానా వ్యక్తి నా కుమారుడు. నేను అజ్ఞాన కాలంలో అతని తల్లితో వ్యభిచరించాను" అని

---

1. *సహీహ్‌బుకారి, కితాబున్నికాహ్-2/769, అబూదావూద్; అధ్యాయం- వుజూ హున్ని కాహ్.*
2. *అబూ దావూద్, మూడు తలాకుల తరువాత తిరిగి భార్యను ఉంచుకోవడం, రెండు తలాకుల సమస్యకు సంబంధించిన వ్యాఖ్యాన గ్రంథాలు.*

https://teluguislam.net



అడిగాడు. దానికి దైవప్రవక్త (స), ఇస్లాం ధర్మంలో ఇలాంటి ప్రశ్నలకు తావే లేదు. అజ్ఞాన కాలం నాటి విషయాలు ఇప్పుడు లేవు. ఇప్పుడు ఆ పిల్లవాని తల్లి ఎవరి భార్యో లేదా ఎవరి బానిసో ఆ పిల్లవాడు అతని కుమారునిగానే తల చడం జరుగుతుంది. వ్యభిచారానికి శిక్ష రాళ్ళే (అంటే రాళ్ళతో కొట్టి చంపడమే అన్నమాట). హజ్రత్ సఅద్ బిన్ అబీ వికాస్ (ర) మరియు 'అబ్దుల్లా జమ్అ' నడుమ, 'జమ్అ బానిస స్త్రీ కుమారుడు - అబ్దుర్రహ్మాన్ బిన్ జమ్అ - గురించి వచ్చిన తగాదా గురించి అందరికీ తెలిసిందే.[3]

అజ్ఞాన కాలంలో తండ్రీకుమారుల సంబంధం కూడా భిన్నంగా ఉండేది. కొందరయితే, "మా సంతానం భూమిపై తిరగాడే మా గుండెలు" అని సగర్వంగా చెప్పుకునేవారు.

అయితే మరోవైపు కొందరు అవమానభారంగా భావించి లేదా దారిద్ర్య భయంతో ఆడపిల్లల్ని సజీవంగా పాతిపెట్టేసేవారు. పిల్లలను దారిద్ర్యభయం వల్ల చంపడమూ జరిగేది.[4] కాని ఈ కాఠిన్యం అందరిలోనూ ఉండేదనడం సరికాదు. కారణం ఏమిటంటే, అరబ్బులు తమ శత్రువుల నుండి రక్షణ కోసం ఇతరుల కంటే తమ సంతానంపైనే అధికంగా ఆధారపడి ఉండడం; ఈ విషయం వారికి బాగా తెలిసిన విషయం.

సొంత సోదరులు, అన్నదమ్ముల పిల్లలు, కుటుంబ సభ్యులు మరియు తమ తెగవారి నడుమగల సంబంధానికి వస్తే ఇవి బాగా పటిష్ఠంగా ఉండేవి. అరబ్బులు తమ తెగల కొమ్ముగాసే అలవాటు ఆధారంగానే జీవించేవారు. దాని కోసమే తమ ప్రాణాల్ని సయితం అర్పించేవారు. తెగల నడుమ పరస్పర సహాయ సహకారాలు, సామూహికతలు సంపూర్తిగా ఉండేవి. దీనికి కొమ్ము గాసే విధానం మరీ పదును పెట్టేది. నిజం చెప్పాలంటే, ఈ వెనుకేసుకు వచ్చే విధానం, సంబంధబాంధవ్యాలే వారి సామాజిక జీవితానికి ఆటపట్టుగా ఉండే దనడంలో సందేహం లేదు. "మీ సోదరుణ్ణి ఆదుకోండి, అతడు దౌర్జన్య పరుడైనా, దౌర్జన్యానికి గురి అయినా" అనే అర్థం వచ్చే సామెతనే అనుసరించే వారు. ఇస్లామ్ ఆవిర్భావం తరువాత ఇలాంటి సామెత అర్థాన్ని పూర్తిగా సంస్కరించడం జరిగింది. ఇస్లాం ధర్మం చేసిన సంస్కరణలో దౌర్జన్యపరునికి సహాయపడడమంటే అతణ్ణి దౌర్జన్యం చేయకుండా అడ్డుకోవడం అన్నమాట.

---

3. సహీ బుఖారి-2/999, 1025, అబూ దావూద్-అల్‌వలదులిల్ ఫరాహ్.
4. దివ్యఖుర్ఆన్-6-101, 16-58, 59; 17-31; 81-8.

https://teluguislam.net



గౌరవం, నాయకత్వంలో ఒకరికంటే మరొకరు మించిపోయే ఆలోచన, అనేక మార్లు ఒకే వ్యక్తి ద్వారా ఉనికిలోనికి వచ్చిన తెగల నడుమ యుద్ధానికి కారణ భూతమయ్యేది. దానికి ఉదాహరణ ఔస్ మరియు ఖజ్రజ్, అబస్ మరియు జుబ్యాన్, ఇంకా బక్ర్ మరియు తగ్లబ్ వగైరా తెగల నడుమ సంభవించిన సంఘటనల్లో మనం చూడవచ్చు.

వివిధ తెగల నడుమ గల సంబంధ బాంధవ్యాల వ్యవహారానికొస్తే, ఇవి పూర్తిగా ముక్కచెక్కలై, వాటి శక్తినంతా మరో తెగతో పోరాడటంలోనే ఖర్చయి పోయేది. అయితే ధర్మం, మతం మరియు తాము స్వంతంగా ఏర్పరచుకున్న ఆచార సంప్రదాయాల సంగమం వల్ల ఏర్పడిన నమ్మకాల కారణంగా అప్పు డప్పుడు యుద్ధజ్వాలల్లోని తీవ్రత కొంత తగ్గుముఖం కూడా పట్టేది. కొన్ని సమ యాల్లోనయితే పరస్పర స్నేహం, ప్రమాణ స్వీకారం, విధేయతా సూత్రాలపై తెగలన్నీ ఓ త్రాటిపై నడవడం కూడా కద్దు. అదే కాకుండా నిషిద్ధ మాసాలు వారి జీవనోపాధికి గొప్ప వరంగా పరిణమించేవి.

చెప్పొచ్చిందేమిటంటే, వారి సామాజిక పరిస్థితి మరీ అధ్వాన్నంగా ఉండి అజ్ఞానం ఎల్లెడలా రాజ్యం చేస్తుండేది. తాము ఏర్పరచుకున్న ఆచారాల్లో నిండా మునిగి పశువుల్లా జీవనం గడిపేవారు. స్త్రీ ఓ వ్యాపార వస్తువు. కొన్ని సమయాల్లో స్త్రీల ఎడల మట్టి, రాళ్ళ కంటే నీచంగా ప్రవర్తించడం జరిగేది. జాతుల పరస్పర సంబంధాలు బలహీనమై ఉండడమే కాదు, విచ్ఛిన్నమైపోయి ఉండేవి కూడా. పాలకుల ఆశయం కేవలం ప్రజలను పీడించి వసూలు చేసిన ధనార్జనతో తమ బొక్కసాలు నింపడం, శత్రువులతో యుద్ధానికీ ప్రజలను యుద్ధారంగాల్లోనికి పంపించడం మట్టుకే పరిమితమై ఉండేది.

## ఆర్థిక పరిస్థితి

ఆర్థిక పరిస్థితి, సామాజిక పరిస్థితిని అనుసరించేది. అరబ్బుల ఉపాధిపై దృష్టిని సారిస్తే తప్ప దీన్ని అంచనావేయలేము. వ్యాపారమే వారి జీవనోపాధికి, భృతికి ప్రధానమైన మార్గం గనక వ్యాపార మార్గాల్లో శాంతి వాతావరణం నెల కొంటే తప్ప ఇది సాధ్యమయ్యే విషయం కాదని అందరికీ తెలుసు. అరేబియా పరిస్థితి ఏమిటంటే; కేవలం నిషిద్ధ మాసాల్లోనే, ఉక్కాజ్, జిల్‌మజాజ్ మరియు మజిన్నా పేరుగల సంతలు అరేబియాలో పెట్టడం జరిగేది.

https://teluguislam.net



పరిశ్రమల విషయానికొస్తే, అరబ్బులు ఈ రంగంలో ప్రపంచం మొత్తం లోనూ వెనుకబడి ఉండేవారు. బట్టలు నేయడం, చర్మానికి పదనుపెట్టడం (Tanning) లాంటి కొన్ని పరిశ్రమలున్నా, చాలా మట్టుకు అవి యమన్, హీరా మరియు సిరియాకు పొరుగున ఉన్న అరేబియా ప్రాంతాల్లోనే ఉండేవి. అయితే అరేబియా మధ్యభాగంలో మాత్రం వ్యవసాయం, పశుపోషణ కొంతవరకు జరిగేది. అరబ్బు స్త్రీలందరూ నూలు వడికేవారు. అయితే వీరి కష్టం అంతా యుద్ధాలు, పోరాటాలకు సమిధగా మారేది. ఆకలి, దారిద్ర్యం అరేబియాలో రాజ్యమేలుతుండడం మూలంగా ప్రజలు తాము రోజూ తొడిగే దుస్తులు సైతం పొందలేకపోయేవారు.

## నైతిక విలువలు

అజ్ఞాన కాలపు అరబ్బుల్లో నీచపు అలవాట్లు, భ్రష్టు భావాలు, అవివేకం మరియు స్థిరబుద్ధికి భిన్నమైన చేష్టలు ఉండివుండడం నిర్వివాదాంశం. అయితే వారిలో కొన్ని నైతిక విలువలు కూడా ఉండేవి. వాటిని గమనించిన ఏ వ్యక్తి అయినా ముక్కుపై వ్రేలు వేసుకోకమానడు. ఉదాహరణకు కొన్ని :

**1. దాతృత్వం :** ఈ సుగుణం అజ్ఞాన అరబ్బులందరిలోనూ కానవచ్చేది. ఈ దాతృత్వ గుణంలో ఒకరికంటే మరొకరు మించిపోయే ప్రయత్నం చేసేవారు. అరేబియా కవన సాహిత్యంలోని సగానికిపైగా పద్యపాదాలు ఈ దాతృత్వంతో నిండిపోయినందుకు వారు గర్వించేవారు. ఈ దాతృత్వం పునాదులపైనే ఒకరు తన గురించి గొప్పలు చెప్పుకుంటే మరొకడు ఇంకొకరి దాతృత్వాన్ని శ్లాఘించే వాడు. తీవ్రమైన చలి, పస్తుల కాలంలో ఎవరైనా అతిథి ఇంటికి వస్తే ఆ గడ్డుకాలంలోనూ దాతృత్వపు భావన పెల్లుబికి ఆ ఇంటి యజమాని, తన కుటుంబానికి జీవనాధారంగా ఉన్న ఏకైక పెంటి ఒంటెను జిబహ్ చేసి ఆతిథ్యమిచ్చేవాడు. ఈ ఔదార్యం ఫలితంగానే వారు పెద్ద పెద్ద రక్తపరిహారా లను, జరిమానాలను, ఆర్థిక భారాలను నెత్తికేసుకునేవారు. ఇలా ప్రజలను వినాశనం, రక్తపాతం నుండి రక్షించి ఇతర ధనవంతులు, సర్దారులను తలదన్నినట్లుగా గర్వించేవారు.

ఈ ఔదార్య భావన ఫలితంగానే వారు మద్యపానంపై విర్రవీగేవారు. మద్యపానం గర్వించదగిన విషయం కాదు అని వారికి తెలిసినా, అది ఔదార్యాన్ని, దాతృత్వాన్ని సులభతరం చేస్తుందని వారి నమ్మకం. ఎందుకంటే,

https://teluguislam.net



నిషా మత్తులో సంపదను నీళ్ళప్రాయంగా దానమివ్వడం మనిషికి అంత కష్టంగా అనిపించకపోవడమే. కాబట్టి వీరు ద్రాక్ష చెట్టును ఔదార్యంగాను, ద్రాక్ష సారాయిని 'బిన్తుల్ కరమ్' (ఔదార్యజనితం)గాను భావించేవారు. అజ్ఞాన కాలపు కవనాల్లో ఈ ఔదార్యగుణం, పొగడ్త, స్వోత్కర్ష, ఔన్నత్యాన్ని చాటే ఓ అధ్యాయంగా కనబడుతుంది. 'అంత్రా బిన్ షద్దాద్ అబసీ' తన గ్రంథం 'ముఅల్లకా'లో ఈ అర్థం వచ్చే పద్యపాదాలను ఉటంకించాడు.

"మధ్యాహ్న తీవ్రత తగ్గిన తరువాత, నేను నా ఎడమ వైపున ఉన్న గాజు సీసాలో, సీలు చేయబడిన పసుపు రంగు గల పరిశుభ్రమైన మధువును సేవించాను. దాన్ని త్రాగినప్పుడల్లా నా సంపదను వెదజల్లుతాను. అయినా నా మర్యాదకు ఎలాంటి భంగం కలుగదు. మత్తు దిగినా, నేను దానం చేయడంలో వెనుకాడను. నా నైతికత, నా ఔదార్యం ఎలాంటిదో మీ అందరికీ తెలుసు."

వారు జూదమూ ఆడేవారు. ఇదీ ఆ ఔదార్యగుణ ఫలితమే. అది కూడా దానధర్మాలు చేసే ఓ మార్గమని తలచేవారు. జూదమాడే వారికి వచ్చిన లాభం నుండి మిగిలినదంతా నిరుపేదలకు పంచిపెట్టడం జరిగేది. అందుకే దివ్యఖుర్ఆన్, సారాయి, జూదపు ప్రయోజనాన్ని నిరాకరించకుండా ఇలా సెలవిచ్చింది.

وَإِثْمُهُمَآ أَكْبَرُ مِن نَّفْعِهِمَا

"ఈ రెంటి పాపం వాటి నుండి వచ్చే లాభం కంటే అధికం" (2-219)

**2. మాటకు కట్టుబడి ఉండటం:** ఇది కూడా అజ్ఞాన కాలపు అరబ్బుల్లోని నైతిక సుగుణాల్లో ఒకటి. ప్రమాణం అంటే వారి దృష్టిలో ధర్మం లాంటిది. సతతం దానికి కట్టుబడి ఉండేవారు. ఈ మార్గంలో తమ సంతానం యొక్క ప్రాణాలు పోయినా, ఇల్లు గుల్లయిపోయినా వారికి తక్కువే. దీన్ని అర్థం చేసుకోవాలంటే, హానీ బిన్ మస్ఊద్ షైబానీ, సమూఆయిల్ బిన్ ఆద్ లేదా హాజిబ్ బిన్ జరారహ్ సంఘటనలు చాలు.

**3. ఆత్మాభిమానం:** ఆత్మాభిమానులై ఉండడం, దౌర్జన్యం, పీడనను సహించకపోవడం కూడా అజ్ఞానపు నైతిక విలువల్లో ఒకటి. దీని కారణంగా వారిలో శౌర్యం, ఆత్మాభిమానం హద్దుమీరిపోయి ఉండేది. వెంటనే రోషపూరితులయ్యేవారు. అవమానకరమని అనిపించే చిన్ని చిన్న విషయాల్లో సయితం కత్తులు దూసి నిలబడేవారు. రక్తపాతం కూడా జరిగేది. ఈ మార్గంలో వారికి

https://teluguislam.net



ప్రాణం అంటే లెక్కే ఉండేది కాదు.

**4. సంకల్ప సాధన:** అజ్ఞాన అరబ్బులు ఓ పనిని గౌరవప్రదమైనది, కీర్తిదాయిని అని అనుకుంటే దాన్ని సాధించడానికి తమ ప్రాణాలను సయితం పణంగా పెట్టి దాన్ని సాధించడానికి ప్రయత్నం చేసేవారు. అది వారిలోని ఓ ప్రత్యేకత.

**5. సహనం, సంయమనం:** ఇది కూడా అజ్ఞాన అరబ్బుల్లో ఉండిన శ్లాఘ నీయ ప్రత్యేకత. అయితే ఇది వారి మితిమీరిన శౌర్యపరాక్రమాలు మరియు ఎల్లవేళలా యుద్ధాలలోపాల్గొనడం వల్ల బయటకు కానవచ్చేది కావు.

**6. ఎడారి దేశదిమ్మరుల నిరాడంబరత:** అంటే నాగరికత, కల్మషాలు, ఎత్తుగడలు తెలియకపోవడం. దీని ఫలితంగా వారిలో సత్యం, నీతి, నిజాయితి చోటుచేసుకొని ఉండడం. మోసం, దగా, మాటను జవదాటడం అంటే అసహ్యించుకునేవారు.

అరేబియా ద్వీపానికి మిగతా ప్రపంచంతోగల భౌగోళిక సంబంధ బాంధవ్యాలే కాకుండా అరబ్బుల్లోని ఈ నైతిక విలువల కారణంగానే మానవాళి నాయకత్వానికి మరియు దైవదౌత్య భారం మోయడానికే ఈ జాతిని ఎన్నుకోవడం జరిగిందేమో అని మేము అనుకుంటున్నాం. ఎందుకంటే ఈ నైతిక విలువలు కొన్ని సందర్భాల్లో కల్లోలాన్ని, అశాంతిని రేకెత్తించడానికి కారణ భూతమై అప్పుడప్పుడు భయంకర సంఘటనలు కూడా చోటుచేసుకునేవి. అయితే స్వతహాగా ఇవి చాలా అమూల్యమైన నైతిక విలువలు. కొంత సంస్క రణతో మానవ సమాజానికి ప్రయోజనకరమైనవిగా మారడానికి ఆస్కార ముంది. ఈ కార్యాన్నే ఇస్లామ్ ధర్మం నిర్వహించగలిగింది.

బహుశా ఈ నైతికతల్లో మాటకు కట్టుబడి ఉండడం అనే సుగుణం తరువాత ఆత్మాభిమానం, దాని దృఢత్వం; సంకల్పసాధన అతి విలువైనవి, ప్రయోజనకరమైనవి. కారణం, ఈ ప్రచండ శక్తి, సంకల్పశుద్ధి, సంకల్పసాధన లేకుండా అరాచకాన్ని, కల్లోలాన్ని అంతమొందించి న్యాయ వ్యవస్థను పున రుద్ధరించడం సాధ్యం కాకపోయేది.

అజ్ఞాన అరబ్బుల్లో మరికొన్ని సుగుణాలు కూడా ఉండేవి కాని వాటిని వివరించడం ఇక్కడ అనవసరం.